ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



తూర్పుగోదావరి
జిల్లా వార్తలు

మంగళవారం 1 ఏప్రిల్ 2025 | 5


రంజాన్ సందర్భంగా నిడదవోలులో ముస్లింలతో మంత్రి దుర్గేష్



రాజమహేంద్రవరంలో ముస్లింల ప్రార్థనలు

దీవించు..అల్లా!

ముస్లిం సోదరులు రంజాన్ పండుగను ఘనంగా జరుపుకున్నారు.. 40 రోజులు కఠిక ఉపవాస దీక్షలు చేసిన ముస్లిం సోదరులు సోమవారం వారి వారి కుటుంబాలతో ఆనందంగా రంజాన్ పండుగ చేసుకున్నారు. తెల్లవారుజాము నుంచే మసీదులకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేసి ఉపవాస దీక్షను విరమించారు.. జిల్లా వ్యాప్తంగా రాజమహేంద్రవరం, నిడదవోలు, కొవ్వూరు, అనపర్తి, గోకవరం తదితర మండలాల్లో మసీదులు ముస్లిం సోదరులతో కళకళలాడాయి.. హిందువులు ముస్లింలకు శుభాకాంక్షలు చెప్పడం కనిపించింది.

బిల్లులకు నో టెన్షన్



- ఉద్యోగుల్లో పెరిగిన సంతృప్తి
- దారిలో పెట్టిన కూటమి

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

సాధారణంగా ఆర్థిక సంవత్సరం ముగింపు రోజైన మార్చి 31న ఉద్యోగులు, కాంట్రాక్టర్లు, పెన్షనర్లు,ఇతర బిల్లుల క్లియరెన్స్ విషయంలో పెద్ద టెన్షన్ ఉండేది. 31వ తేదీ అర్ధరాత్రి వరకూ ట్రెజరీలు పనిచేసేవి.అనేక మంది బిల్లులు పెండింగ్‌లో ఉండిపోయేవి. అందరూ ట్రెజరీ అధికారుల చుట్టూ తిరిగేవారు. ట్రెజరీ అధికారులకు లంచాలు ఇస్తేనే కొన్ని బిల్లుల చెల్లింపులు జరిగేవి. ఈ ఏడాది బిల్లుల విషయంలో ఎవరికీ టెన్షన్ లేకపోవడం గమనార్హం. రాజమహేంద్రవరం జిల్లా ట్రెజరీ కార్యాలయంతో పాటు డివిజనల్ కార్యాలయం ఉంది. కొవ్వూరు, నిడదవోలు, అనపర్తి, కోరుకొండ మండల కేంద్రాల్లో సబ్- ట్రెజరీ కార్యాలయాలు ఉన్నాయి. జిల్లాలో సుమారు 19వేల మంది ఉద్యోగులు ఉన్నారు.వీరికి జీతాల కింద రూ.100 కోట్లు వరకూ చెల్లిస్తుంటారు. సుమారు 13 వేల మంది పింఛనుదారులకు సుమారు రూ.40 కోట్ల వరకూ అందుతోంది.ఇక్కడ రిటైర్మెంట్ బెనిఫిట్స్, సరెండర్ లీవులు, డెత్ బెనిఫిట్స్, జీపీఎఫ్, ఎన్‌క్యాష్‌మెంట్ ఆఫర్ ఎర్న్ లీవులు వంటివన్నీ ఇక్కడ నుంచి రిలీజ్ అవుతుంటాయి. ఈ సారి ఏ సమస్య లేకుండా ముందుగానే క్లియర్ చేసినట్టు జిల్లా ట్రెజరీ అధికారి ఎన్.సత్యనారాయణ తెలిపారు. గత ప్రభుత్వంలో బిల్లులు పాసవ్వాలంటే చాలా ఇబ్బంది పడాల్సి వచ్చేది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నెమ్మదిగా అన్నీ దారిలో పడ్డాయి. గ్రీన్‌ఛానల్ ద్వారా అనేక బిల్లులకు ప్రభుత్వమే సీఎఫ్ఎంఎస్ ద్వారా క్లియర్ చేస్తోంది.అందరిలోనూ సంతృప్తిని పెంచుతోంది.



రిజిస్ట్రేషన్లకు..
స్లాట్ బుకింగ్

- జిల్లాలో 4 నుంచి అమలు
- గంటకు 12 స్లాట్లు
- టైమ్‌కి రాకపోతే రద్దు
- రాజమండ్రి ఆర్‌వోలో సేవలు
- సమయం వృథాకు స్వస్తి

రాజమహేంద్రవరం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : ప్రతి శాఖను సంస్కరించడం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోంది. దీనిలో రిజిస్ట్రేషన్ల శాఖలో ఓ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకొస్తోంది. ఆస్తుల రిజిస్ట్రేషన్ల తిప్పలను తప్పించడానికి ప్రభుత్వం నూతన ఆలోచన చేసింది. ఉదయం రిజిస్ట్రేషను ఆఫీస్‌కి వెళితే సాయంత్రం వరకూ వేచి ఉండే పరిస్థితికి స్వస్తి పలకనుంది. దీనిలో భాగంగా పాస్‌పోర్టుల మాదిరిగా స్లాట్ బుకింగ్ సదుపాయాన్ని ఈ నెల 4 నుంచి అందుబాటులోకి తీసుకురానుంది. రిజిస్ట్రేషను అవసరం ఉన్న వాళ్లు registration.ap.gov.in వెబ్‌సైటులోకి వెళితే అందుబాటులో ఉన్న స్లాట్లు కనిపిస్తాయి. క్రయవిక్రయదారుల్లో ఎవరో ఒకరు స్లాట్ బుక్ చేసిన వెంటనే వారికి ఓటీపీ మెసేజ్ ద్వారా వస్తుంది. దానిని రిజిస్ట్రేషను సమయంలో రిజిస్ట్రారుకు చెప్పాల్సి ఉంటుంది. ప్రస్తుతానికి జిల్లాకు ఒక రిజిస్ట్రారు కార్యాలయానికి ఈ సదుపాయం పరిమితం చేశారు. క్రమేణా వచ్చే సమస్యలను అధిగమించి అన్ని రిజిస్ట్రారు కార్యాలయాలకు దీనిని వర్తింపజేయనున్నారు. తూర్పు గోదావరి జిల్లాలో రాజమండ్రి రిజిస్ట్రారు కార్యాలయంలో ఈ సేవలు అందుబాటులో ఉండనున్నాయి. ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ గంటకు 12 చొప్పున స్లాట్లు ఉంటాయి. ఒకసారి స్లాట్ బుక్ చేసుకున్న తర్వాత ఆ సమయానికి రిజిస్ట్రారు కార్యాలయానికి వెళితే అరగంటలో రిజిస్ట్రేషను పూర్తవుతుందని జిల్లా రిజిస్ట్రారు రెడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. స్లాట్ సమయం నుంచి గంట లోపుగా స్లాట్ బుక్ చేసుకున్నవారు రాకపోతే రద్దవుతుందన్నారు. అందుబాటులో ఉన్న స్లాట్లకు అనుగుణంగా మళ్లీ స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుంద న్నారు.దీని వల్ల తమ కార్యాలయాల్లో క్రయవిక్రయదారులు ఎక్కువ సేపు వేచి ఉండే అవసరం ఉండదన్నారు.ఈ సదుపాయాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



కొవ్వూరు వద్ద టోల్‌గేట్.. ధరల బోర్డు మారుస్తున్న సిబ్బంది

టోల్..మోత!



బాదుడు ఇలా..

వాహనదారులపై మళ్లీ టోల్ భారం

- సోమవారం రాత్రి నుంచి అమలు
- 10 నెలల్లో రెండు సార్లు
- రూ.5 నుంచి 50 వరకూ పెంపు
- పాస్‌ల రుసుము పెంపుదల
- ఫాస్టాగ్‌లో అదనంగా కట్
- వాహనదారుల ఆందోళన
- ఉమ్మడి జిల్లాలో 6 టోల్‌గేట్లు

టోల్‌చార్జీల బాదుడు మళ్లీ మొదలైంది. టోల్ ప్లాజాల వద్ద వసూలు చేసే రుసుములను పెంచుతూ నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా తీసుకున్న నిర్ణయం సోమవారం అర్ధ రాత్రి 12 గంటలు దాటిన తర్వాత నుంచి అమల్లోకి వచ్చింది. పదినెలల వ్యవధిలో రెండోసారి చార్జీలు పెంచడంతో వాహనదారులు షాక్‌కు గురయ్యారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తంగా ఆరు టోల్ ప్లాజాలు ఉన్నాయి.

(ఆంధ్రజ్యోతి-కొవ్వూరు/నల్లజర్ల)

ప్రభుత్వం వాహనదారులకు షాక్ వచ్చింది. కేవలం పది నెలల వ్యవధిలోనే రెండు సార్లు టోల్ రుసుములు పెంచడంతో ఆందోళనకు గురవుతున్నారు.సోమవారం అర్ధరాత్రి 12.01 గంటల నుంచి పెంచిన టోల్‌చార్జీలను వసూలు చేయడం ఆరంభించారు.గతేడాది జూన్‌లో పెంచి ఏడాది తిరక్కుండానే మళ్లీ చార్జీలు పెంచడంపై వాహనదారులు టోల్‌ప్లాజా సిబ్బందితో వాగ్వాదానికి దిగుతున్నారు.ఈ పరిస్థితి ఉమ్మడి జిల్లాలోని అన్ని టోల్‌ప్లాజాల వద్ద కనిపించింది. తమ ఫాస్టాగ్‌లో అధికంగా కట్ అయిందంటూ సోమవారం అర్ధరాత్రి తర్వాత పలువురు వాహనదారులు చాలా చోట్ల సిబ్బందిని నిలదీశారు.

పది నెలల్లో రెండో సారి..

అన్ని రకాల నాలుగు చక్రాల వాహనాలు ఆయా టోల్‌గేట్ల వద్ద నిర్ణీత రుసుమును ఫాస్టాగ్ ద్వారా చెల్లించాలి. ఫాస్టాగ్ లేకపోతే చార్జీలు 100 శాతం వరకూ అదనంగా వసూలు చేస్తారు.ఈ చార్జీలను నేషనల్ హైవే అథారిటీ నిర్ణయిస్తుంది. సాధారణంగా రహదారి నిర్మాణానికి అయ్యే వ్యయానికి అనుగుణంగా ఈ చార్జీలను నిర్ణయించి వసూలు చేస్తారు.ఇప్పుడు వీటిని ప్రతి ఏటా పెంచుతున్నారు. 2024-25లో జూన్ 3న టోల్ రుసుములు పెంచగా.. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచే పెంచుతూ నేషనల్ హైవే అథారిటీ నిర్ణయం తీసుకుంది. దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆరు టోల్‌ప్లాజాల్లో పెంపు నిర్ణయం అమల్లోకి వచ్చింది. రుసుముల పెంపులో ఎన్‌హెచ్ ఒక్కొక్క చోట ఒక్కో విధానాన్ని అవలంబించింది. 216వ జాతీయ రహదారిపై ఉన్న టోల్ ప్లాజాల్లో కార్లు, జీపులు, వేన్‌లు ఇతర తేలికపాటి వాహనాలకు ఒకవైపు రుసుమును పెంచలేదు. 24 గంటల వ్యవధిలో తిరిగి వస్తే వసూలు రుసుం మాత్రం పెంచారు.ఎన్‌హెచ్ 16పై మాత్రం అన్ని రకాల టోల్ రుసుములు పెంచి షాక్ ఇచ్చారు. టోల్‌గేట్ పరిధిలో ఉండే వాహనదారులకు ఇచ్చే నెలవారీ పాస్‌ల రుసుములను భారీగా పెంచారు. రూ.340గా ఉన్న రుసుమును రూ.350 చేశారు.

ఉమ్మడి జిల్లాలో టోల్‌గేట్లు ఇవీ..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో జాతీయ రహదారి 16పై తుని-రాజమహేంద్రవరం మధ్య కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం కృష్ణవరం,దివాన్‌చెరువు-సిద్ధాంతం మధ్య డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం ఈతకోట వద్ద టోల్‌ప్లాజాలు ఉన్నాయి. 216వ జాతీయ రహదారిపై కత్తిపూడి-కాకినాడ బైపాస్ మధ్య గొల్లప్రోలు, గురజనాపల్లి-పాశర్లపూడి మధ్య గల కోనసీమ జిల్లా అన్నంపల్లి వద్ద టోల్‌ప్లాజాలు ఉన్నాయి.ఇవన్నీ నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ఆధీనంలో ఉంటాయి.తూర్పుగోదావరి జిల్లాలో కొవ్వూరు గామన్ బ్రిడ్జిపైనల్లజర్ల మండలం వీరవల్లి వద్ద రెండు టోల్‌ప్లాజాలు ఉన్నాయి.ఇవి రాష్ట్ర ప్రభుత్వసంస్థ ఏపీఆర్‌డీసీ ఆధీనంలో ఉన్నాయి.

ఈతకోట (రావులపాలెం)

వాహనం	పాతది	కొత్తది
కారు,జీపు,వ్యాన్ -	రూ.120	125
రెండు వైపులా	రూ. 180	185
మినీబస్‌లు -	రూ.195	200
రెండు వైపులా	రూ. 290	300
బస్ లేదా ట్రక్	రూ. 405	420
రెండు వైపులా	రూ. 610	630
వ్యాపార వాహనాలు	రూ.445	460
రెండు వైపులా	రూ.665	690
భారీ వాహనాలు	రూ.445	460
రెండు వైపులా	రూ.665	690
మెషినరీ వాహనాలు	రూ.635	660
రెండు వైపులా	రూ.955	990
అతి భారీ వాహనాలు	రూ.775	805
రెండు వైపులా	రూ.1165	1205
నెలవారీ పాస్‌లు	రూ.340	350

కొవ్వూరు టోల్‌గేట్..(216ఏ)

వాహనం	పాతది	కొత్తది
కారు,జీపు,వ్యాన్ -	రూ.72	72
రెండు వైపులా	రూ. 108	110
మినీబస్‌లు -	రూ.108	110
రెండు వైపులా	రూ. 158	162
బస్ లేదా ట్రక్	రూ. 213	219
రెండు వైపులా	రూ. 320	328
వ్యాపార వాహనాలు	రూ.309	317
రెండు వైపులా	రూ.463	475

కృష్ణవరం (కిర్లంపూడి)

వాహనం	పాతది	కొత్తది
కారు,జీపు,వ్యాన్ -	రూ. 105	110
రెండు వైపులా	రూ. 160	165
మినీబస్‌లు -	రూ. 170	180
రెండు వైపులా	రూ. 260	265
బస్ లేదా ట్రక్	రూ. 360	375
రెండు వైపులా	రూ. 540	560
వ్యాపార వాహనాలు	రూ.395	410
రెండు వైపులా	రూ.590	610
మెషినరీ వాహనాలు	రూ.560	585
రెండు వైపులా	రూ.850	880
అతి భారీ వాహనాలు	రూ.690	715
రెండు వైపులా	రూ.1035	1070

అన్నంపల్లి (ముమ్మిడివరం)

వాహనం	పాతది	కొత్తది
కారు,జీపు,వ్యాన్ -	రూ. 60	60
రెండు వైపులా	రూ. 90	95
మినీబస్‌లు -	రూ. 95	100
రెండు వైపులా	రూ. 145	150
బస్ లేదా ట్రక్	రూ. 205	210
రెండు వైపులా	రూ. 305	315
వ్యాపార వాహనాలు	రూ.225	230
రెండు వైపులా	రూ.335	245
మెషినరీ వాహనాలు	రూ.320	330
రెండు వైపులా	రూ.480	495
అతి భారీ వాహనాలు	రూ.390	405
రెండు వైపులా	రూ.585	605

గొల్లప్రోలు టోల్‌గేట్

వాహనం	పాతది	కొత్తది
కారు,జీపు,వ్యాన్ -	రూ. 50	50
రెండు వైపులా	రూ. 75	80
మినీబస్‌లు -	రూ. 80	85
రెండు వైపులా	రూ. 120	125
బస్ లేదా ట్రక్	రూ. 170	175
రెండు వైపులా	రూ. 255	265
వ్యాపార వాహనాలు	రూ.185	195
రెండు వైపులా	రూ.280	290
మెషినరీ వాహనాలు	రూ.270	275
రెండు వైపులా	రూ.400	415
అతి భారీ వాహనాలు	రూ.325	340
రెండు వైపులా	రూ.490	505

వీరవల్లి (నల్లజర్ల)

వాహనం	పాతది	కొత్తది
కారు,జీపు,వ్యాన్ -	రూ. 160	165
రెండు వైపులా	రూ. 240	245
మినీబస్‌లు -	రూ. 255	265
రెండు వైపులా	రూ. 385	400
బస్ లేదా ట్రక్	రూ. 535	555
రెండు వైపులా	రూ. 805	835
వ్యాపార వాహనాలు	రూ.585	605
రెండు వైపులా	రూ.880	910
మెషినరీ వాహనాలు	రూ.840	870
రెండు వైపులా	రూ.1265	1310
అతి భారీ వాహనాలు	రూ.1025	1060
రెండు వైపులా	రూ.1540	1595

నేటి నుంచి రెండో ఉచిత సిలిండర్ బుకింగ్ ప్రారంభం

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని 2వ ఉచిత గ్యాస్ సిలిండర్ బుకింగ్ మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. ఈ మేరకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడంతో జిల్లా పౌరసరఫరాల అధికారులు అన్ని గ్యాస్ ఏజెన్సీలను అప్రమత్తం చేశారు. కూటమి ఎన్నికల హామీల్లో భాగంగా అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన గ్యాస్ వినియోగదారులకు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ హామీకి అనుగుణంగా తొలి ఉచిత గ్యాస్ సిలిండర్ బుకింగ్ గడువు మార్చి నెలాఖరుతో ముగిసింది. జిల్లాలో 4,68,010 మంది గ్యాస్ లబ్ధిదారులుండగా దాదాపు 40 వేల మంది వరకూ తొలి ఉచిత సిలిండర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోలేకపోయారు.

నల్లజర్లలో హత్య

ప్రేమ పెళ్లి చేసుకుని సరిగా చూడడంలేదని ఘాతుకం

7

రూ.84.61 కోట్లు వసూలు



రాజమహేంద్రవరంలో రాత్రి 12 గంటల వరకూ పన్నుల వసూళ్లు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పన్నులు చెల్లింపుదారులకు ఇచ్చిన వెసులుబాటును వినియోగదారులు సద్వినియోగం చేసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా మార్చి 31 ఆర్థిక సంవత్సరం ముగింపు పన్నులు చెల్లింపులు సోమవారం సమర్థవంతంగా జరిగాయి. జిల్లాలో రాజమహేంద్రవరం కార్పొరేషన్, కొవ్వూరు, నిడదవోలు మునిసిపాలిటీలతో పాటు ఇతర పంచాయతీల్లో సైతం పన్నులు చెల్లింపుల ప్రక్రియ వేగంగా సాగింది. సెలవు రోజులైన ఆదివారం, సోమవారం కూడా పన్నుల చెల్లింపుదార్ల కోసం అధికారులు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. ప్రజలు ఆయా కౌంటర్లను వినియోగించుకున్నారు. రాజమహేంద్రవరంలో 8 ప్రత్యేక కౌంటర్లను కమిషనర్ కేతన్ గార్గ్ ఏర్పాటు చేశారు. రాజమహేంద్రవరం కార్పొరేషన్ పరిధిలో పన్నులు చెల్లింపు దారులు ప్రభుత్వం కల్పించిన పన్నుల వడ్డీపై ప్రకటించిన 50 శాతం రాయితీ వినియోగించుకున్నారు. రాజమహేంద్రవరం నగరంలో సోమవారం ఒక్కరోజేఇంటిపన్నులు, ఖాళీ స్థలాల పన్నులు, వాటర్ చార్జీలు కలిసి మొత్తం రూ3 కోట్లు ప్రజలు కట్టారు.ఇప్పటి వరకు ఇంటి పన్నులకు సంబంధించి మొత్తం రూ.69 కోట్లు డిమాండ్‌కు మార్చి 31వ తేదీ అర్ధరాత్రి 12 గంటల వరకు రూ.65.19 కోట్లు వసూలు చేశారు.ఖాళీస్థలాల పన్నులు రూ.12.45 లక్షలు, వాటర్ చార్జీలు రూ.9.19 కోట్లు వసూలు చేశారు.చివరి రోజున హౌస్ ట్యాక్స్ రూ.2.19 కోట్లు, ఖాళీ స్థలాల పన్నులు రూ.44.87 లక్షలు ,వాటర్ చార్జీలు రూ.24 లక్షలు వసూలు చేశారు.రాజమహేంద్రవరంలో మొత్తం రూ.84.61 కోట్లు వసూలు చేసినట్టు కమిషనర్ తెలిపారు. ఇంకా 53.27 కోట్లు వసూలు కావాల్సి ఉంది.


మంత్రి దుర్గేష్ సమక్షంలో జనసేనలో చేరిన వైసీపీ కౌన్సిలర్లు, నాయకులు

నిడదవోలులో మారుతున్న రాజకీయం

- జనసేనలోకి మరో ఇద్దరు
- కౌన్సిల్‌లో 11కి పెరిగిన బలం
- టచ్‌లో మరో ముగ్గురు?

నిడదవోలు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : నిడదవోలు పురపాలక సంఘంలో జనసేన పాగా వేసే సూచనలు కనిపిస్తున్నాయి. ఒక్కొక్కరుగా జనసేన పంచన చేరుతున్నారు. నిడదవోలులో వైసీపీకి చెందిన సీనియర్ నాయకురాలు, 6వ వార్డు కౌన్సిలర్ పువ్వల రతీదేవి,8వ వార్డు కౌన్సిలర్ గుర్రం శాంతిశ్రీ , జిల్లా వైసీపీ బీసీ సెల్ సెక్రటరీ గంగుల గోపియాదవ్, పట్టణ వైసీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గుర్రం జేమ్స్ సోమవారం జనసేన తీర్థం పుచ్చుకున్నారు.ఈ మేరకు రాష్ట్ర పర్యాటక,సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కందుల దుర్గేష్ జనసేన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గత ఎన్నికల్లో నిడదవోలు పురపాలక సంఘంలో 28వ వార్డులకు 27 వార్డుల్లో వైసీపీ కౌన్సిలర్లు విజయం సాధించగా.. ఒక టీడీపీ కౌన్సిలర్ ఉన్నారు. ఇటీవల జరిగిన రాజకీయ పరిణామాల్లో వైసీపీ నుంచి 9 మంది కౌన్సిలర్లు జనసేనలో జాయినయ్యారు. సోమవారం మరో ఇద్దరు చేరడంతో కౌన్సిల్‌లో జనసేన బలం 11కి పెరిగింది. దీనికి తోడు ఒక టీడీపీ కౌన్సిలర్ ఉన్నారు. త్వరలో మరో ముగ్గురు వైసీపీ కౌన్సిలర్లు జనసేనతో జత కట్టేందుకు సిద్ధంగా ఉన్నట్టు సమాచారం. త్వరలో జరగనున్న అవిశ్వాస తీర్మానంలో మునిసిపల్ కౌన్సిల్‌ను జనసేన ఖాతాలో వేసేందుకు జనసేన నాయకులు డాక్టర్ తోపరాల కళ్యాణ్ చక్రవర్తి, పెన్మెత్స చందులు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు.

లక్ష బంగారు కుటుంబాలు పీ-4 సర్వేలో గుర్తింపు

రాజమహేంద్రవరం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 5 లక్షల కుటుంబాలను సర్వే చేయగా అందులో సుమారు లక్ష పేద కుటుంబాలు ఉన్నట్టు అధికారులు గుర్తించారు. రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు పీ-4 సర్వే చేపట్టాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. 20 శాతంగా ఉన్న పేదలకు 10 శాతంగా ఉన్న సంపన్న వర్గాల ద్వారా సహాయం చేసి అభివృద్ధిలోకి తేవడానికి జీరో పావర్టీ-పీ4 మార్గదర్శి(బంగారు కుటుంబం) పేరుతో సర్వే చేపట్టిన సంగతి తెలిసిందే.లక్ష కుటుంబాలను అభివృద్ధి చేసే యోచనలో ప్రభుత్వం ఉంది. ప్రభుత్వం నుంచి గైడ్‌లైన్స్ రావాల్సి ఉంది. త్వర లో మార్గదర్శకాలు విడుదల చేయనుంది.

నేడు ఐచ్ఛిక సెలవు

రాజమహేంద్రవరం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి):రంజాన్ మరుసటి రోజైన మంగళవారం ఐచ్ఛిక సెలవు ప్రకటిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీ వక్ఫ్‌బోర్డు సీఈవో నివేదిక ఆధారంగా నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొంది. ఉద్యోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అల్లాహో..అల్లా


రాజమహేంద్రవరంలో కౌగిలించుకుని శుభాకాంక్షలు తెలియజేసుకుంటున్న చిన్నారులు


కాకినాడలో....

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా సోమవారం రంజాన్ పండుగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో చేసుకున్నారు. మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అలింగనం చేసుకుని పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు



కాకినాడలో జేఎన్‌టీయూకే సెంటర్ వద్ద నమాజ్ చేస్తున్న చిన్నారులు


అమలాపురంలో..



రంజాన్ సందర్భంగా రాజమహేంద్రవరంలో ఓ మసీదులో ముస్లింలు, నెహ్రూ నగర్‌లో ప్రార్థనలో పాల్గొన్న చిన్నారులు


మామిడికుదురులో ప్రార్థనలు చేస్తున్న ముస్లిం సోదరులు

కబళించిన కారు!

బైక్‌ను ఢీకొనడంతో ఇద్దరు మృతి

కొంతమూరులో ఘటన


సంఘటనా స్థలంలో బైక్


ఘటనా స్థలంలో...


వెంకటేష్(ఫైల్)




నాగబాబు(ఫైల్)

రాజానగరం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): కారు రూపంలో వచ్చిన మృత్యువు ఇద్దరిని కబలించి రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొంతమూరులో సోమవారం తెల్లవారు జామున జరిగిన ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొంతమూరులోని కళ్యాణ్‌నగర్‌కు చెందిన ఒంటెద్దు వెంకటేష్ (29) బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఉగాది సందర్భంగా స్వగ్రామం వచ్చాడు. రాజమహేంద్రవరంలోని స్నేహితులను కలిసేందుకు వెళ్లాడు. తిరిగి ఇంటికి వచ్చేం దుకు మోరంపూడికి చెందిన ర్యాపిడో బైకిస్టు ఈర్లు నాగబాబు(43)ను ఆశ్రయించాడు. ర్యాపిడో బైక్‌పై ఇద్దరు కొంతమూరుకు వస్తుండగా మార్గ మధ్యంలో మనీషా ఫంక్షన్ హాల్ సమీపంలో రాత్రి 2 గంటల సమయంలో వెనుక వైపు నుంచి వేగంగా వస్తున్న కారు వీరు ప్రయాణిస్తున్న మోటార్‌సైకిల్‌ను బలంగా ఢీకొంది. ప్రమాదానికి కారణమైన కారులో ఉన్న యువకులు మద్యం మత్తులో ఉన్నట్టుగా తెలిసింది. దీంతో మద్యం మత్తు ఆ రెండు కుటుంబాలను తీవ్ర విషాదంలోకి నెట్టింది. ఈ ప్రమాదంలో వెంకటేష్‌ను కారు దాదాపు కిలోమీటర్ మేర ఈడ్చుకుంటూ వెళ్లింది. వెంకటేష్ తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మరణించాడు. నాగబాబుకు కూడా బలమైన గాయాలయ్యాయి. సంఘటనా స్థలంలో కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న తరుణంలో చికిత్స కోసం రాజమహేంద్రవరం తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారని రాజానగరం పోలీసులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన కారు ఆగకుండా వెళ్లిందని, మృతుల కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించామన్నారు. ఈ మేరకు రాజానగరం ఎస్ఐ మనోహర్ కేసును దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలు

ఒకరి పరిస్థితి విషమం


క్షతగాత్రులు

సామర్లకోట, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెం కెనాల్ రోడ్డులో సోమవారం జరిగిన ప్రమాదంలో మోటార్ సైకిల్‌పై సామర్లకోట వైపు వెళ్తున్న దంపతులు తీవ్రంగా గాయపడ్డారు. తూర్పు గోదావరి జిల్లా అనపర్తికి చెందిన నలుగురు మైనర్లతో మరొక మైనరు కారును వేగంగా నడుపుతూ వేట్లపాలెం వద్ద మోటార్ సైకిల్‌ను ఢీకొనడమే గాక సుమారు 100 అడుగుల దూరం వరకూ ఈడ్చుకుంటు వెళ్లడంతో తలలకు బలమైన గాయాలయ్యాయి. వేట్లపాలేనికి చెందిన గద్దే లక్ష్మీనారాయణ తన భార్య వీరవెంకట శిరీషతో కలిసి మోటార్‌సైకిల్‌పై కాకినాడ వెళ్తుండగా వెంకటేశ్వరస్వామి గుడి వద్దకు వచ్చేసరికి సామర్లకోట నుంచి బిక్కవోలు వెళుతున్న కారు అతివేగంగా ఢీకొనడంతో ఈ ప్రమాదం జరి గింది. బాధితులను కారులో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారును సామర్లకోట పోలీసులు స్వాధీనం చేసుకుని నలుగురు మైనర్లను అదుపులోకి తీసుకున్నారు. సామర్లకోట పోలీసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వశిష్ట నదిలోకి దూసుకెళ్లిన కారు

నలుగురు యువకులు సురక్షితం


నదిలోకి దూసుకువెళ్లిన కారు

ఆత్రేయపురం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా వశిష్ట గోదావరి నదిలోకి పాత ఆనకట్ట మీద నుంచి కారులో సోమవారం సాయంత్రం నిడదవోలుకు చెందిన ఓ కారులో సుమారు నలుగురు యువకులు వెళ్లారు. కారు అదుపుతప్పి దిగువకు దూసుకుపోయింది. గోదావరిలో నీరు లేకపోవడంతో కారులో ఉన్న యువకులు సురక్షితంగా బయటపడ్డారు.

దేవదాయ మంత్రికి వెంకన్న కల్యాణోత్సవాల ఆహ్వానం


మంత్రికి ఆహ్వాన పత్రికను అందిస్తున్న ఆలయ ఉపకమిషనరు చక్రధరరావు

ఆత్రేయపురం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి దివ్య కల్యాణమహోత్సవం ఏప్రిల్ 7 నుంచి వారం రోజుల పాటు నిర్వహించనున్నారు. 8న రథోత్సవం, తీర్థం, కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర దేవదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి కల్యాణోత్సవ ఆహ్వాన పత్రికను ఆలయ ఉకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు స్వయగా అమరావతి క్యాంపు కార్యాలయానికి వెళ్లి అందజేశారు. స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలను కూడా అందజేశారు.

వెంకన్న ఆలయంలో ఆర్జేసీ పూజలు

వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం రాత్రి ద్వారక తిరుమల ఆర్జేసీ ఎన్వీ.సత్యనారాయణమూర్తి స్వామివారిని దర్శించుకున్నారు. అర్చక బృందం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనానంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితుల ఆశీర్వచనం అందుకున్నారు. ఆయనతో పాటు వచ్చిన దేవస్థానం అధికారులు స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు స్వామి చిత్రపటం అందచేశారు.


వాడపల్లి వెంకన్న ఆలయంలో ఆర్జేసీకి స్వామివారి చిత్రపటం అందచేస్తున్న దృశ్యం

మడికి అంతర్‌రాష్ట్ర కూరగాయల మార్కెట్ సమయాలు మార్పు

ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండుసార్లు నిర్వహణ

ఆలమూరు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం మడికి నాలుగు లైన్ల జాతీయ రహదారికి చెంత ఉన్న అంతర్‌రాష్ట్ర కూరగాయల మార్కెట్ వేళలను మార్పు చేసినట్టు మార్కెట్ కమిటీ అధ్యక్షుడు పాలూరి సత్తిబాబు ఒక ప్రకటనలో వెల్లడించారు. ఉదయం 5 గంటల నుంచి మార్కెట్‌లో కొనుగోలు, అమ్మకాలు జరుగుతాయి. మధ్యాహ్నం 1గంట నుంచి మార్కెట్ తిరిగి ప్రారంభై 5గంటల వరకు జరుగతుంది. రోజుకు రెండుసార్లు ఈ మార్కెట్ నిర్వహిస్తారు. మారిన వేళలు ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తాయని సత్తిబాబు తెలిపారు. ఈవేళలు పాటించకుండా రైతులు లేదా వ్యాపారులు మార్కెట్‌లో అమ్మకాలు, కొనుగోలు చేస్తే రూ.2వేలు జరిమానా విధిస్తున్నట్టు హెచ్చరించారు. ఇప్పటివరకు మార్కెట్‌లో వేలాపాల లేకపోవడం వల్ల అటు రైతులు, ఇటు కొనుగోలుదారులకు సమన్వయం కుదరక నష్టం వాటిల్లుతుంది. ఈ విషయాన్ని గుర్తించి మార్కెట్ కమిటీ ఈ నిర్ణయాన్ని తీసుకుంది. ఈ మార్కెట్‌కు ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల నుంచి పెద్దఎత్తున కూరగాయలను రైతులు తీసుకొస్తారు. వ్యాపారస్తులు కూడా వివిధ జిల్లాలు, దూరప్రాంతాల నుంచి ఇక్కడికి వస్తుంటారు. కచ్చితమైన సమయాలు ఇప్పటివరకు పాటించకపోవడం వల్ల రైతులు ఎప్పుడూ కూరగాయలు తేవాలో కొనుగోలుదారులు ఎప్పుడు రావాలో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. అందుకనే ఈ సమయాలను నిర్ణయించామని, ఆ సమయాల్లోనే అమ్మకాలు, కొనుగోలు జరుగుతాయని మార్కెట్ కమిటీ అధ్యక్షుడు సత్తిబాబు వివరించారు. దూరప్రాంతాల నుంచి వచ్చే రైతులు, వ్యాపారస్తులు వేళలను గుర్తించాలని కోరారు.

క్షణాల్లో కారు దగ్ధం

త్రుటిలో తప్పిన ప్రమాదం

సురక్షితంగా బయటపడ్డ దంపతులు


అనంతపల్లి టోల్‌ప్లాజా వద్ద దగ్ధం అవుతున్న కారు

నల్లజర్ల, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): కర్నూల్ నుంచి రాజమహేంద్రవరం వెళ్తున్న కారు అనంతపల్లి టోల్‌ప్లాజా వద్ద ఆదివారం సాయంత్రం అగ్నికి ఆహుతైంది. వివరాలు ఇలా ఉన్నాయి. సీఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ రత్నం తన భర్త మహేశ్‌తో కర్నూల్ నుంచి రాజమహేంద్రవరం వెళ్తున్నారు. అనంతపల్లి టోల్ ప్లాజా వద్దకు కారు రాగ ఇంజన్‌లో సమస్య ఏర్పాడి కాలిపోతున్న వాసన రావడంతో హూటాహూటిన కారు రోడ్డుపక్కకు నిలిపి ఇద్దరు దిగిపోయారు. ఒక్కసారిగా ఇంజన్ నుంచి మంటలు వచ్చి అందరు చూస్తుండగానే క్షణల్లో కారు మొత్తం దగ్ధం అయ్యింది. సురక్షింతంగా బయటపడ్డ దంపతులు మరో వాహనంలో వారి గమ్య స్థానానికి వెళ్లిపోయారు. దీనిపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని సీఐ వై.రాంబాబు తెలిపారు.

ఆలోచింపచేసిన నాటికలు

ఉగాది ఆహ్వాన నాటిక పోటీల్లో భాగంగా రెండోరోజు మూడు ప్రదర్శనలు

రావులపాలెం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం సీఆర్సీ కాటన్ కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 25వ ఉగాది ఆహ్వాన నాటిక పోటీల్లో భాగంగా రెండోరోజు సోమవారం ప్రదర్శించిన నాటికలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేయడంతో పాటు ఆలోచింపచేశాయి. ముందుగా విశ్వశాంతి కల్చరల్ అసోషియేషన్ హైదరాబాద్ వారి స్వేచ్ఛనాటికను ప్రదర్శించారు. దర్శకత్వం బీఎం రెడ్డి, రచన పరమాత్ముని శివరాం వ్యవహరించారు. అనంతరం విజయవాడకు చెందిన మైత్రి కళానిలయం వారి బ్రహ్మస్వరూపం నాటికను ప్రదర్శించారు. దర్శకత్వం టీవీ పురుషోత్తం, రచన స్నిగ్ధ వ్యవహరించారు. తర్వాత మిత్ర క్రియేషన్స్ హైదరాబాద్ వారి ఇది రహదారి కాదు నాటిక ప్రదర్శన నిర్వహించారు. దర్శకత్వం ఎస్ఎం బాషా, రచన ఆకురాతి భాస్కరచంద్ర వ్యవహరించారు. నాటకోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన చిన్నారుల నృత్య ప్రదర్శన అలరించింది. వారికి తెలుగురైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, సీఆర్సీ అధ్యక్షుడు తాడి నాగమోహన్‌రెడ్డి, సినీనటులు గౌతంరాజు, జోగినాయుడు బహుమతులు అందజేశారు.


రావులపాలెంలో స్వేచ్ఛ నాటిక ప్రదర్శిస్తున్న కళాకారులు


నృత్య ప్రదర్శన కళాకారులకు బహుమతులు అందజేస్తున్న రామకృష్ణ, నాగమోహన్‌రెడ్డి


హైదరాబాద్ రవీంద్రభారతిలో కిన్నెర ఆర్ట్ థియేటర్స్ వారు నిర్వహించిన శ్రీ విశ్వావసు ఉగాది కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ నుంచి గౌరవ పురస్కారం అందుకుంటున్న అనపర్తికి చెందిన ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ తేతలి దశరథరామారెడ్డి

చెల్లెళ్ని చంపుతానని బెదిరించిన అన్నపై కేసు

కొవ్వూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): తన వాటా ఇంట్లోకి వెళ్తున్న చెల్లెల్ని అడ్డుకుని చంపుతానని బెదిరించిన అన్నపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ ఏఎస్ఐ జీ.జీ ప్రకాష్ తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు పట్టణంలోని క్రిస్టియన్‌పేటకు చెందిన జంగం రమాదేవి తల్లితండ్రులకు రెండు పోర్షన్ల భవనం ఉంది. ఆ ఇంటిలో అవివాహితుడైన సోదరుడు పోలుమాటి బీమారావుకు చెందిన ఒక వాటాను రమాదేవి పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించారు. మార్చి 19వ తేదీన తన వాటా ఇంటిలోకి వెళ్తున్న రమాదేవిని అన్నయ్య పోలుమాటి రాంబాబు అడ్డగించి దాడి చేశాడు. ఇంట్లోకి వెళ్లాలని చూస్తే చంపుతానని బెదిరించాడని ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసినట్టు ఏఎస్ఐ ప్రకాష్ తెలిపారు.

మొక్కు తీర్చేందుకు విజయవాడ వెళ్తూ...

రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి


గొల్లప్రోలు రైల్వేస్టేషన్ వద్ద అనిల్‌కుమార్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు



గొల్లప్రోలు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): కూతురుకి పుట్టి వెంట్రుకలు తీయించేందుకు విజయవాడ కనకదుర్గమ్మ గుడికి వెళ్తూ రైలు నుంచి ప్రమాదవశాత్తు జారి పడి వ్యక్తి మరణించాడు. విశాఖపట్టణం మర్రిపాలెం ప్రాంతానికి చెందిన అనిల్‌కుమార్ (34) కూతురికి పుట్టి వెంట్రుకలు తీయించేందుకు విజయవాడ వెళ్లేందుకు విశాఖ నుంచి హైదరాబాదు వెళ్లే వీక్లి సూపర్‌ఫాస్ట్ రైలులో కుటుంబసభ్యులతో కలిసి బయలుదేరాడు. సోమవారం భోజనం చేసి చేయి కడుక్కునేందుకు వాష్‌బేసిన్ వద్దకు వచ్చాడు. రైలు కుదుపులకు కాకి నాడ జిల్లా గొల్లప్రోలు రైల్వేస్టేషన్ వద్దకు వచ్చేసరికి కిందకు జారిపడి మరణించాడు. కూతురి మొక్కు తీర్చుకునేందుకు వెళ్తుండగా అనిల్‌కుమార్ మరణించడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. తుని రైల్వే ఎస్ఐ జి.శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైనతేయ గోదావరి నదిలో దూకేసిన వృద్ధుడు

తొండవరం సమీపంలో మృతదేహం లభ్యం

అల్లవరం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): కారులో వచ్చిన ఓ వృద్ధుడు వైనతేయ గోదావరి నదిలో దూకేయగా మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. వివరాలిలా ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామి డికుదురు మండలం బోడసకుర్రు వైనతేయ బ్రిడ్జి పైనుంచి ఆదివారం రాత్రి 62 ఏళ్ల వ్యక్తి గోదావరిలో దూకి గల్లంతయ్యాడు. షిఫ్ట్ డిజైర్ కారులో వచ్చిన ఆ వ్యక్తి బ్రిడ్జిపైన కారు వదిలి వైనతేయ గోదావరిలోకి దూకేశాడని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దాంతో ఆ కారు నంబరు ఆధారంగా ఆ వ్యక్తిని పోలీసులు గుర్తించారు. అమలాపురం పట్టణానికి చెందిన చోడపనీడి వెంకటేశ్వరరావు (62)గా గుర్తించిన పోలీసులు ఆచూకీ కోసం సోమవారం గాలింపు చర్యలు చేపట్టారు. వెంకటేశ్వరరావు మృతదేహం అంబాజీపేట మండలం తొండవరం సమీపంలో లభ్యమైనట్టు అల్లవరం ఎస్ఐ టి.తిరుమలరావు చెప్పారు. అయితే ఆర్థిక పరమైన లావాదేవీల కారణంగానే వెంకటేశ్వరరావు ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

ప్రేమించి పెళ్లి చేసుకుని..

సరిగా ఏలుకోవడంలేదని చంపేశారు!

బావను హత్యచేసిన బావమరిది, మామ మరో ముగ్గురు

తూర్పుగోదావరి జిల్లా నల్లజర్లలో దారుణం


రక్తపు మడుగులో శివ మృతదేహం

నల్లజర్ల, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ప్రేమ పెళ్లి చేసుకుని సక్రమంగా ఏలుకోవడంలేదని బావను బావమరిది, మామ మరో ముగ్గురు కలిసి అత్యంత పాశవికంగా హత్య చేశారు. తూర్పుగోదావరి జిల్లా నల్లజర్లకు చెందిన పేరం శివ(27) తన ఇంటి పక్కనే ఉన్న రేగుల వెంకటేశు కుమార్తె భానుని నాలుగేళ్ల కిందట ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి రెండేళ్ల పాప ఉంది. తరచూ దంపతుల మధ్య గొడవలు జరగడం పెద్దల్లో పెట్టి మళ్లీ ఒక్కటి చేయడం జరుగుతుంది. తరచూ మద్యం సేవించి వచ్చి భార్యతో గొడవపడడం చేస్తుండేవాడు. పెళ్లయినప్పటి నుంచి ఇదే తంతు.. ఇదిలా ఉండగా 3 రోజుల కిందట భార్యభర్తల మధ్య మళ్లీ గొడవ జరగడంతో ఆమె పాపతో పుట్టింటికి వెళ్లిపోయింది. సోమవారం ఉదయం తన భార్యను పంపించాలని శివ అత్తింటికి వెళ్లి కోరగా తాము పంపించమని చెప్పడంతో వెళ్లిపోయాడు. సోమవారం సాయంత్రం శివ మామ రేగుల వెంకన్న, బావమరిది శ్రీరామ్, బంధువులు మంగయ్య, రత్తయ్య, రాజు ఆయిల్ ఫాం గెలలు కోసే రెండు కత్తులు పట్టుకుని శివ ఇంటికి వెళ్లారు. నీ కొడుకు ఎక్కడ అని శివ తల్లి దండ్రులు భారతి, వెంకటేశ్‌లను అడిగారు. పక్క గదిలో భోజనం చేస్తున్నాడని చెప్పడంతో అక్కడికి వెళ్లారు. భోజనం చేస్తున్న శివను వెనక నుంచి పట్టుకుని బావమరిది, మిగిలిన వారు ఒక్కసారిగా కత్తులతో పీక కోసి అత్యంత పాశవికంగా హతమార్చారు. రక్తపు మడుగులో కొట్టుకుని శివ అక్కడికక్కడే మృతిచెందాడు. దీంతో ఒక్కసారిగా భయానక పరిస్థితులు నెలకొన్నాయి. శివ మృతదేహాన్ని చూసిన తల్లిదండ్రులు కన్నీటిపర్యంతమయ్యారు. స్థానికులు రావడంతో అక్కడ నుంచి దుండగులు పరారయ్యారు. అత్యంత క్రూరంగా శివను హత్య చేయడంతో కాలనీవాసులు భయాందోళన చెందారు. ఆసుపత్రికి తరలించేలోపే శివ కొట్టుకుంటూ ప్రాణం వదిలాడు. స్థానికుల సమాచారం మేరకు 108 సిబ్బంది వచ్చి పరిశీలించి అప్పటికే శివ మృతి చెందినట్టు చెప్పారు. సమాచారం అందుకున్న సీఐ వై.రాంబాబు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాజమహేంద్రవరం

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి

డాక్టర్ చంద్రశేఖర్ సేవలు అనిర్వచనీయం

ఎమ్మెల్యే నల్లమిల్లి, మాజీ ఎంపీ హర్షకుమార్



డాక్టర్ చంద్రశేఖర్ బిందు దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

అనపర్తి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): వైద్య వృత్తికే వన్నె తెచ్చిన డాక్టర్ చంద్రశేఖర్ సేవలు అనిర్వచనీయమని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ అన్నారు. అనపర్తి ఏరియా ఆసుపత్రిలో సివిల్ సర్జన్, జనరల్ మెడిసన్‌గా విధులు నిర్వర్తిస్తూ సోమవారం స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన డాక్టర్ చంద్రశేఖర్ దంపతులను ఆసుపత్రి సిబ్బంది ఘనంగా సత్కరించారు. స్థానిక టీజీఆర్ ఫంక్షన్ హాల్లో జరిగిన సభకు అధ్యక్షత వహించిన ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తాడి రామగుర్రెడ్డి మాట్లాడుతూ చంద్రశేఖర్ ప్రభుత్వ వైద్యునిగా 22 ఏళ్ల పాటు అందించిన సేవలను వివరించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ బిందు దంపతులను నల్లమిల్లి,హర్షకుమార్ సత్కరించి మెమెంటోను అందజేశారు. కార్యక్రమంలో పలువురు వైద్యులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మహిళల కోసం మాజీ ఎంపీ మాట్లాడడం

హాస్యాస్పదం : మజ్జి రాంబాబు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ఎంపీ కాకముందు అమ్మాయిని వేధించిన కేసులో ఉన్న మాజీ ఎంపీ భరత్‌రామ్ ఇప్పుడు మహిళల కోసం మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని టీడీపీ రాజమహేంద్రవరం పార్లమెంట్ కమిటీ ఉపాధ్యక్షుడు మజ్జి రాంబాబు ఆరోపించారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదిహేను రోజులకు ఒకసారి పారాచ్యూట్ లీడర్ భరత్‌రామ్ హైదరాబాద్ నుంచి రాజమహేంద్రవరం వచ్చి అవగాహన లేని మాటలు మాట్లాడుతున్నాడన్నారు. విద్యార్థిని అంజలి సంఘటనలో గాని, పాస్టర్ ప్రవీణ్ సంఘటనలో గాని కనీస అవగాహన లేకుండా మాట్లాడుతున్నాడని జీడీ రిపోర్టుకు, ఎఫ్ఐఆర్‌కు తేడా కూడా తెలియకుండానే అతను ఎంపీ ఎలా చేసారో అర్థం కావడంలేదన్నారు. సమావేశంలో ఉప్పులూరి జానకిరామయ్య, పోలాకి పరమేష్, కడలి రామకృష్ణ, చెల్లుబోయిన సూర్యనారాయణమూర్తి, సనపతి సత్తిబాబు, ఈతలపాటి రవి, కిలపర్తి నాగభూషణం పాల్గొన్నారు.

బ్రాహ్మణ యువతకు ఉత్తమ బాటలు వేస్తాం

రాష్ట్ర బ్రాహ్మణ యువజన సమైక్య అధ్యక్షుడు కామేష్



కామేష్ దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం కల్చరల్ మార్చి31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బ్రాహ్మణ యువతకు విద్య, ఉపాధి రంగాల్లో ఉత్తమ బాటలు వేస్తామని నూతనంగా నియమితులైన రాష్ట్ర బ్రాహ్మణ యువజన సమైక్య అధ్యక్షుడు, న్యాయవాది సూరంపూడి కామేష్ అన్నారు. బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు మాదిరాజు శ్రీనివాసుల స్వగృహంలో సోమవారం ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కామేష్ దంపతులను జిల్లా బ్రాహ్మణ నగర ప్రతినిధులు సత్కరించారు. కామేష్ మాట్లాడుతూ బ్రాహ్మణ యువతను మేధావులుగా తయారుచేసే అన్ని కార్యక్రమాలను రాష్ట్రవ్యాప్తంగా చేపడతామన్నారు. సాంకేతిక పద్ధతుల ద్వారా విద్య, ఉపాధి అవకాశాలను వారికి అందజేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కలగా సుబ్రహ్మణ్యం, నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు దూర్వాసుల సత్యనారాయణ, కార్యదర్శి గుడిపూడి సునీల్, గౌతమ్, మహిళా నాయకురాలు డాక్టర్ శ్రీపాద సీతామహలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

100 గంటల సామూహిక భజనలు

రంగంపేట, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి శత జయంతి సందర్భంగా కోటపాడులో 100 గంటల సామూహిక భజనలు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ఇంటి ముంగిట రంగోలి ముగ్గులు పెట్టి, పచ్చని తోరణాలు అలంకరించారు. కుటుంబ సభ్యులంతా సామూహికంగా కూర్చొని బాబా చిత్రపటం వద్ద రెండుగంటల పాటు 50 ఇళ్లలో భజనలు చేశారు. శ్రీసత్య సాయిబాబా శత జయంతి ఉత్సవాల సందర్భంగా 100 గంటలపాటు ఒక్కొక్క ఇంట్లో రెండు గంటల చొప్పున 50 ఇళ్లలో సామూహిక భజనలు చేశామని కోటపాడు శ్రీసత్యసాయి సేవా సమితి కన్వీనర్ కందర్ప వెంకట అమర్నాథ్ తెలిపారు.

సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసిన వ్యక్తిపై కేసు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 31(ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ పగడాల మరణంపై సోషల్ మీడియాలో వివిధ రకాలుగా దుష్ప్రచారం చేస్తున్న రాజమహేంద్రవరం లలితానగర్‌కు చెందిన దేవాబత్తుల నాగమహేష్‌పై కేసు నమోదు చేసినట్టు త్రీటౌన్ సీఐ అప్పారావు తెలిపారు. ప్రవీణ్ మృతిపై తప్పుడు ప్రచారం చేస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన నాగ మహేష్‌పై క్రైమ్ నెంబరు 141/2025గా యు/ఎస్ 196(1), 351 ఎన్‌బీఎస్ అండ్ సెక్షన్ 76 ఆఫ్ఐటి యాక్ట్ 2000-08 కింద కేసు నమోదు చేసినట్టు తెలిపారు. నిందితుడ్ని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచామన్నారు. పూర్తి విషయం తెలియకుండా తప్పుడు వార్తలను, ఫేక్ వీడియోలు ప్రసారం చేసినా, మతపరమైన గొడవలకు ఆస్కారం ఉన్న వీడియోలను, ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బాలిక అదృశ్యం

రెండు గంటల్లోనే సాంకేతికత సాయంతో ఛేదించిన పోలీసులు

ధవళేశ్వరం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): బీరువాలో పెట్టిన రూ.500 తీయడం చూసేశారన్న భయంతో నాల్గో తరగతి చదువుతున్న చిన్నారి ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఫిర్యాదు అందిన రెండు గంటల్లోనే సాంకేతికత సహాయంతో చిన్నారిని తల్లిదండ్రులకు అప్పగించిన సంఘటన ధవళేశ్వరం పోలీస్‌స్టేషన్‌లో జరిగింది. వివరాల్లోకి వెళితే స్థానిక సున్నం బట్టి వీధిలో నివసిస్తున్న అల్లు రవికుమార్, లక్ష్మమ్మల పెద్ద కుమార్తె శ్రీదుర్గ నాల్గో తరగతి చదువుతోంది. సోమవారం ఉదయం ఇంట్లోని బీరువాలో ఉన్న రూ.500 తీస్తుండగా చూసేశారని భయపడి ఆ డబ్బుతో ఉదయం 9గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లిపోయింది. చుట్టుపక్కల వెతికినా కనిపించకపోవడంతో తల్లిదండ్రులు ధవళేశ్వరం పోలీసులను ఆశ్రయించారు. దక్షిణ మండలి డీఎస్పీ భవ్యకిషోర్ ఆధ్వర్యంలో సీఐ టి.గణేష్, ఎస్ఐ క్రాంతికుమార్, సిబ్బందితో నాలుగు బృందాలుగా ఏర్పడి సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించి పాప రాజమహేంద్రవరం వైపు వెళ్లినట్టు గుర్తించి శ్యామలా సెంటర్ వద్ద పాప ఆచూకీ కనిపెట్టి తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు.ఫిర్యాదు అందిన వెంటనే స్పందించి సాంకేతికత సహకారంతో పాపను గుర్తించిన సీఐ, ఎస్ఐలతోపాటు స్టేషన్ సిబ్బందిని ఎస్పీ నరసింహకిషోర్ అభినందించారు.

రక్తదాన శిబిరం

దాతలకు హెల్మెట్లు అందజేత

కడియం, మార్చి 31(ఆంధ్రజ్యోతి): సంకల్పం సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నర్సరీ సంఘ కార్యాలయం వద్ద రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి రక్తదాతలకు హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ శిబిరాన్ని సీఐ ఎ.వెంకటేశ్వరరావు, సంకల్పం వ్యవస్థాపకుడు యడ్ల వరప్రసాద్, గంధం శంకర్, సత్య, భానుశ్రీ, సూరిబాబు సంయుక్తంగా ప్రారంభించారు. సీఐ మాట్లాడుతూ రక్తదానం మరొకరి ప్రాణం నిలుపుతుందని, తలకు హెల్మెట్లు ధరించడం వల్ల రక్షణ కలగడంతో పాటు ప్రాణం కాపాడుకొనే వీలుందన్నారు. హరిత సంకల్పం అధ్యక్షుడు గాద నాగేశ్వరరావు మాట్లాడుతూ సంకల్పం సంస్థ ఇప్పటి వరకు 7,200 యూనిట్ల రక్తం సేకరించిందన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ దుర్గాప్రసాద్, ఇన్‌చార్జి సర్పంచ్ పాటంశెట్టి రాంజీ, నర్సరీ సంఘం అధ్యక్షుడు రత్నం అయ్యప్ప, మల్లు పోలరాజు, బొర్సు సుబ్రహ్మణ్యం, ముద్రగడ జమీ, నక్కా అమ్మిరాజు పాల్గొన్నారు.

'వ్యవసాయ మార్కెట్లను కార్పొరేట్లకు అప్పగించొద్దు'

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యవసాయ మార్కెట్లను ప్రధాని మోదీ ప్రభుత్వం బడా కార్పొరేట్ శక్తులకు అప్పగించాలనుకోవడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఏఐకేఎంఎస్ జాతీయ అధ్యక్షురాలు వి.టాన్య అన్నారు. సోమవారం సాయంత్రం రాజమహేంద్రవరంలోని మావో భవన్‌లో అమెరికన్ సామ్రాజ్యవాదానికి నరేంద్ర మోదీ ప్రభుత్వ లొంగుబాటు విధానాలను నిరసిస్తూ ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టాన్యా మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ రెండో సారి ఎన్నికైన తర్వాత సామ్రాజ్యవాద ధోరణులకు పాల్పడుతున్నాడని, భారత పాలకులు సైతం అమెరికా దోపిడీ విధానాలకు లొంగిపోవడం బాధాకరమని అన్నారు. ఈ క్రమంలో మన పాలకులు అమెరికా వంటి సామ్రాజ్యవాద బడా కార్పొరేట్ శక్తులకు భారత వ్యవసాయ మార్కెట్లను అప్పగించడానికి ప్రయత్నించడం దారుణమని అన్నారు. స్వామినాధన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని, పంటలకు కనీస మద్దతు ధర చట్టబద్ధం చేయాలని డిమాండ్ చేశారు.

మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సూరెడ్డి

సీతానగరం, మార్చి 31(ఆంధ్రజ్యోతి) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ సైనిక సంక్షేమ సంఘం మొదటి ప్రధాన కార్యదర్శిగా వంగలపూడి గ్రామానికి చెందిన సూరెడ్డి శివకుమార్ ఎంపికయ్యారు. ఈ మేరకు ఆయన సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. విజయవాడలో రాష్ట్ర అడహక్ కమిటీ కన్వీనర్ కె.గోవిందరావు సూచనల మేరకు సంఘం గౌరవాధ్యక్షుడు అన్నె రామారావు సమక్షంలో మాజీ సైనికుల రాష్ట్ర కమిటీని ఎంపిక చేశారు. నేవీ మాజీ సైనికుడు సూరెడ్డి శివకుమార్ సంఘం ప్రధాన కార్యదర్శిగా ఎంపికయ్యారు. జిల్లా నుంచి మొట్టమొదటి ప్రధాన కార్యదర్శిగా ఎంపికవ్వడం హర్షనీయమని పలువురు అభినందించారు. శివకుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మాజీ సైనికుల కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. మాజీ సైనికుల హక్కులపై పోరాడతానన్నారు.

ఈద్ ముబారక్



పందలపాకలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



దివాన్‌చెరువులో ఎమ్మెల్యే బత్తుల కలిసిన మసీదు సభ్యులు

» భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు
» మస్జిద్‌లలో ముస్లింల ప్రార్థనలు
» పేదలకు దానాలు

బిక్కవోలు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మండలంలో ముస్లింలు అందరూ భక్తిశ్రద్ధలతో సోమవారం రంజాన్ వేడుకలను జరుపుకున్నారు. పందలపాక అహలే సున్నత్ వల్ జమాత్ జామియా మస్జిద్‌లో గురువు గులామ్‌గౌస్ అందరితో ప్రార్థనలు చేయించారు. బిక్కవోలులోని మదీనా మస్జిద్‌లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికొకరు ఈద్ ముబారక్ అంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పేదలకు వివిధ దానాలు చేశారు.

దివాన్‌చెరువు: రంజాన్ మాసంలోని కఠిన ఉపవాస దీక్షలు, క్రమశిక్షణతో చేసిన ప్రార్థనలు, జకాత్, ఫిత్రా దానధర్మాలు సమత, మమతను పెంచుతాయని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. లాలాచెరువు హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన మసీదు సభ్యులు సోమవారం ఎమ్మెల్యే బత్తులను వారి ఇంటి వద్ద కలసి రంజాన్ వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. బంధుమిత్రులతో కలసి ఆనందంగా ఈద్‌ఉల్‌ఫితర్ వేడుకలు జరుపుకోవాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే బత్తుల దంపతులను మసీద్ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో ముస్లిం నాయకులు, టీడీపీ, జనసేన, బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కడియం: వీరవరంలో మస్జిద్ ముబారక్, జామియా మస్జిద్ పరిధిలోని ముస్లింలు ప్రార్థనలు చేశారు. అనంతరం వక్ఫ్ బిల్లును వ్యతిరేకిస్తూ ముస్లింలు నల్లరిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో జమాతే ఇస్లామి హింద్ మండల నాయకులు ఎండీ దాదాషరీఫ్, ఎస్‌కే షరీఫ్, ఎస్‌కే సిద్దసాహెబ్, గౌస్, యూసఫ్, వలీ నాగురు, ఇర్ఫాన్ పాల్గొన్నారు.

అనపర్తి: నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లింలు రంజాన్ సందర్భంగా మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు, అనపర్తిలో నల్లకాలువ సమీపంలోని అంజుమాన్ నూర్ ఇస్లామ్ మసీదులో ఇమామ్ అబ్దుల్ రహమాన్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అలాగే ఐఎల్‌టీడీ సమీపంలోని ముఖరం మసీదులోను, కుతుకులూరు మసీదులోను ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమాలలో టీడీ పీ రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యవర్గ సభ్యుడు షేక్ దరియా సాహెబ్, ఈసీబు పాల్గొన్నారు.

గోకవరం: గోకవరంలో జుమ్మా మసీద్‌లో జరిగిన రంజాన్ వేడుకల్లో ముస్లింలు ఒకరికొకరు ఆలింగనం చేసుకొని ఈద్ ముబారక్ అంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. 30 రోజులు ఉపవాస దీక్షను పూర్తి చేసుకొని రంజాన్ పండుగను భక్తి శ్రద్ధల నడుమ జరుపుకునే అవకాశం ఇచ్చిన అల్లాకు కృతజ్ఞతలు తెలిపారు.

కోరుకొండ: మండలంలోని జంబుపట్నం, గోనగూడెం, కోరుకొండ, కాపవరం గ్రామాల్లో ముస్లింలు రంజాన్ పండుగను జరుపుకున్నారు. ఈ సందర్భంగా మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. వారికి పలువురు ప్రజా ప్రతినిధులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో షేక్ బిజిలాని, మతార్‌బీబీ, షేక్, రజీమాబేగం పాల్గొన్నారు.



గోకవరంలో ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు



వీరవరంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

పట్టభద్రుల ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్



రాజశేఖర్‌ను సత్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయులు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పట్టభద్రుల ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ అన్నారు. రాజమహేంద్రవరం ఆనం రోటరీ హాలులో సోమవారం సాయంత్రం ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసిన మాట్లాడారు. సమస్యలపై పూర్తిస్థాయిలో అవగాహన ఉందని వాటి పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కృషిచేస్తుందన్నారు. ఏపీ ఉపాధ్యాయ సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు కోలా సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీఈవో కె.వాసుదేవరావు, ఫ్యాప్టో రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సాయిశ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెవ్వూరి రవి, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు పల్లా రాజారావు, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు డేనియల్‌బాబు, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.నాగరాజు, మున్సిపల్ టీచర్స్ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్, ఎంటీఎస్ సంఘం జిల్లా అధ్యక్షుడు వెలుగు జ్యోతి, భాషా పండితుల సంఘం అధ్యక్షుడు ఏసుబాబు, ఎస్ఎల్‌టీ జిల్లా అధ్యక్షుడు స్వామినాథన్ పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయినులకు సత్కారం

జిల్లా వ్యాప్తంగా 60 మంది ఉత్తమ మహిళా ఉపాధ్యాయులను ఎస్టీయూ ఆధ్వర్యంలో సత్కరించారు. దీనికి జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శులు దానియేలుబాబు, లక్ష్మణరావులు, నెక్స్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు సాయిశ్రీనివాస్, ఉపాధ్యక్షుడు జాకోబ్, మున్సిపల్ కన్వీనర్ ఎ.సూరిబాబు హాజరయ్యారు. సాయిశ్రీనివాస్ మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లోను ఉన్నారని ఉపాధ్యాయ రంగంలో 50శాతం కంటే ఎక్కువ ఉన్నారన్నారు. అనేక ఉపాధ్యాయ ఉద్యమాల్లో కీలకంగా వ్యవహరించారని అటువంటి వారిని సత్కరించుకోవడం ఆనందంగా ఉందన్నారు.

అంజలికి ఏం జరిగినా ఆసుపత్రిదే బాధ్యత

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు విశ్వేశ్వరరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న టీకే విశ్వేశ్వరరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ఫార్మడి విద్యార్థిని ఎన్.నాగాంజలికి ఏం జరిగినా కిమ్స్ బొల్లినేని ఆసుపత్రి యాజమాన్యానిదే పూర్తి బాధ్యత అని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకుల బృందం ఆసుపత్రికి వెళ్లి అంజలి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని వచ్చినట్టు తెలిపారు. ఈ సందర్భంగా రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో టీకే మాట్లాడారు. అంజలి ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉందన్నారు. నాలుగు రోజులుగా రాజమహేంద్రవరంలో అనుకోని సంఘటనలు జరుగుతున్నా ప్రభుత్వం చూసీచూడనట్టు వ్యవహరిస్తోందన్నారు. అంజలిని లైంగిక వేధింపులకు గురిచేసిన దీపక్‌పై కఠినమైన సెక్షన్లు పెట్టకుండా పోలీసులు నిర్లక్ష్యంగా కేసు నమోదు చేశారని ఆరోపించారు. ఆమెకు ఏమి జరిగినా ఆసుపత్రి యాజమాన్యానిదే బాధ్యత అని, బాధిత కుటుంబానికి రూ.కోటి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై అనుమానాలు నివృతి చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. సమావేశంలో పీసీసీ ఉపాధ్యక్షుడు మార్టిన్ లూథర్, డాక్టర్ వడయార్, అబ్దుల్లా షరీఫ్, మోతా శారద, మణి, కొండ్రాజు, చిన్నం మురళీకృష్ణ, వై.శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్రైస్తవులపై దాడులు అరికట్టాలి

పాస్టర్ ప్రవీణ్ మృతికి సంతాపంగా రంపయర్రంపాలెం, సీతానగరంలో శాంతియుత ర్యాలీలు



రంపయర్రంపాలెంలో చేపట్టిన శాంతియుత ర్యాలీ

గోకవరం, మార్చి 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో క్రైస్తవులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతికి కారకులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మండలంలోని రంపయర్రంపాలెంలో సోమవారం క్రైస్తవ సంఘాల పాస్టర్స్, సంఘ పెద్దలు శాంతియుత ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా పాస్టర్లు మాట్లాడుతూ ప్రవీణ్ పగడాల మృతిపై సమగ్ర విచారణ జరిపి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఉన్నతమైన భావజాలాలు కల్గిన పాస్టర్ ప్రవీణ్‌ను అతికిరాతకంగా హత్య చేయడాన్ని ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం విచారణను మరింత వేగవంతం చేసి సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు చేపట్టాలన్నారు. అన్ని సీసీ కెమెరాల పుటేజీలను బయట పెట్టాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో వివిధ సంఘాల పాస్టర్లు, పెద్దలు పాల్గొన్నారు.

సీతానగరం: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతి వెనుక ఉన్న నిజాలను విచారించి న్యాయం చేయాలని కోరుతూ పాస్టర్ నారాయణమూర్తి ఆధ్వర్యంలో మండల ఐక్య క్రైస్తవ సమాజం శాంతియుత నిరసన ర్యాలీ నిర్వహించింది. ఈ సందర్భంగా నారాయణమూర్తి మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్‌కు జరిగిన ప్రమాదాన్ని వివాదాస్పద మృతిగాను, హత్యగాను చిత్రీకరించారని, పోలీసులు కూడా వివాదాస్పద మృతిగానే కేసు నమోదు చేశారన్నారు. అది ప్రమాదమా? హత్యా? అనే విషయాలను తేల్చి సమాజానికి, క్రైస్తవులకు వారి మనోభావాలకు మనోధైర్య ఇచ్చే విధంగా త్వరగా విచారణ చేసి కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతున్నామని అన్నారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో రాజీవ్ జోషియ్య, నక్కా జాయ్, గెడ్డం రత్నం, సనమండ్ర ఆశీర్వాదం పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్య ఉద్యోగుల సమస్యలపై దృష్టిపెట్టాలి

ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆస్కార్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న ఆస్కార్‌రావు

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్యశాఖ ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం దృష్టిసారించాలని ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆస్కార్‌రావు కోరారు. సోమవారం రాజమహేంద్రవరంలో జరిగిన సంఘం సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. తమ సంఘం 2002లోనే గుర్తింపు సాధించిందని, అయితే ఇటీవల కొందరు అవకాశవాద నాయకులు తెలుగునాడు వైద్య, ఆరోగ్య ఉద్యోగుల సంఘం అంటూ హడావిడి చేస్తున్నారని ఆరోపించారు. మరోమారు గుర్తింపు ఎన్నికలు నిర్వహించి తమపై పోటీ చేసి గెలవాలే తప్ప తమ సంఘాన్ని ఇబ్బంది పెట్టడం సరికాదని అన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కలసికట్టుగా పనిచేద్దామన్నారు. గుర్తింపులేని సంఘం నాయకులు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో తిష్టవేసుకుని ఉద్యోగుల ప్రయోజనాలకు మోకాలడ్డుతున్నారని, వారిని కట్టడి చేయకపోతే ఆందోళన చేస్తామన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ఎంవీవీ సత్యనారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసరాజు, రామచంద్రరావు, భవానీ, మంగ, బేబీ, పార్వతీశం పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 31(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రత్నం పేటకు చెందిన 15 ఏళ్ల బాలిక మార్చి 29 నుంచి కనిపించడం లేదని త్రీటౌన్ పోలీసులు తెలిపారు. సదరు బాలిక స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. తన తల్లి గత నెల 29న ఊరు వెళ్లాక తాను కూడా అదే ఊరు వెళ్తున్నాని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఊరు వెళ్లలేదు. దీంతో ఊరు నుంచి సోమవారం తిరిగి వచ్చిన బాలిక తల్లి తన కుమార్తె కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విఘ్నేశ్వరాలయ ధ్వజస్తంభ పునః ప్రతిష్ఠ

రాజమహేంద్రవరం కల్చరల్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): స్థానిక ఏవీ అప్పారావు రోడ్డులోని శ్రీ వరసిద్ధి విఘ్నేశ్వర ఆలయ ధ్వజస్తంభ పునః ప్రతిష్ఠ మహోత్సవం సోమవారం జరిగింది. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాభివృద్ధికి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

శ్రీసత్తెమ్మ తల్లి తీర్థం

రంగంపేట, మార్చి 31(ఆంధ్రజ్యోతి): రంగంపేటలో కంటిపూడి ఆనందరావు కుటుంబీకుల కొబ్బరి తోటలో శ్రీసత్తెమ్మతల్లి ఆలయ వార్షిక తీర్థమహోత్సవం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారి విగ్రహానికి ప్రత్యేక పూజలు, అన్నదానం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

రంగంపేట విద్యార్థినులకు ఉగాది పురస్కారాలు



ఉగాది పురస్కారాలు అందుకున్న భవ్యశ్రీ,బాల సరస్వతి

రంగంపేట, మార్చి 31(ఆంధ్రజ్యోతి): పశ్చిమగోదావరి జిల్లా తణుకులో సోమవారం జరిగిన ఉగాది పురస్కారాలు సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో కూచిపూడి నాట్యం ప్రదర్శించిన రంగంపేట గ్రామానికి చెందిన పాలాటి భవ్యశ్రీ, కోటపాడు గ్రామానికి చెందిన పెమ్మనబోయిన బాలసరస్వతి ఉగాది పురస్కారాలు అందుకున్నారు. అలాగే వారి తల్లిదండ్రులను ఘనంగా సత్కరించారు.

గొడుగులమ్మ జాతర

కోరుకొండ, మార్చి 31(ఆంధ్రజ్యోతి): జంబుపట్నం గ్రామ దేవత గొడుగులమ్మ జాతర వైభవంగా సాగుతోంది. మూడో రోజైన సోమవారం మేళతాళాల మధ్య అమ్మవారి గరగలు గ్రామంలో తిరిగాయి. గ్రామస్థులు గరగలకు పసుపు నీళ్లు పోసి పానకం, వడపప్పు, చలివిడి, పసుపు, కుంకుమ నివేదన చేశారు. ముగింపు రోజున ప్రత్యేక గ్రామోత్సవం నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.





రంజాన్ సందర్భంగా నిడదవోలులో ముస్లింలతో మంత్రి దుర్గేష్





రాజమహేంద్రవరంలో ముస్లింల ప్రార్థనలు

దీవించు..అల్లా!

ముస్లిం సోదరులు రంజాన్ పండుగను ఘనంగా జరుపుకున్నారు.. 40 రోజులు కటిక ఉపవాస దీక్షలు చేసిన ముస్లిం సోదరులు సోమవారం వారి వారి కుటుంబాలతో ఆనందంగా రంజాన్ పండుగ చేసుకున్నారు. తెల్లవారుజాము నుంచే మసీదులకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేసి ఉపవాస దీక్షను విరమించారు.. జిల్లా వ్యాప్తంగా రాజమహేంద్రవరం, నిడదవోలు, కొవ్వూరు, అనపర్తి, గోకవరం తదితర మండలాల్లో మసీదులు ముస్లిం సోదరులతో కళకళలాడాయి.. హిందువులు ముస్లింలకు శుభాకాంక్షలు చెప్పడం కనిపించింది.

బిల్లులకు నో టెన్షన్



- ఉద్యోగుల్లో పెరిగిన సంతృప్తి
- దారిలో పెట్టిన కూటమి

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

సాధారణంగా ఆర్థిక సంవత్సరం ముగింపు రోజైన మార్చి 31న ఉద్యోగులు, కాంట్రాక్టర్లు, పెన్షనర్లు,ఇతర బిల్లుల క్లియరెన్స్ విషయంలో పెద్ద టెన్షన్ ఉండేది. 31వ తేదీ అర్ధరాత్రి వరకూ ట్రెజరీలు పనిచేసేవి.అనేక మంది బిల్లులు పెండింగ్‌లో ఉండిపోయేవి. అందరూ ట్రెజరీ అధికారుల చుట్టూ తిరిగేవారు. ట్రెజరీ అధికారులకు లంచాలు ఇస్తేనే కొన్ని బిల్లుల చెల్లింపులు జరిగేవి. ఈ ఏడాది బిల్లుల విషయంలో ఎవరికీ టెన్షన్ లేకపోవడం గమనార్హం. రాజమహేంద్రవరం జిల్లా ట్రెజరీ కార్యాలయంతో పాటు డివిజనల్ కార్యాలయం ఉంది. కొవ్వూరు, నిడదవోలు, అనపర్తి, కోరుకొండ మండల కేంద్రాల్లో సబ్- ట్రెజరీ కార్యాలయాలు ఉన్నాయి. జిల్లాలో సుమారు 19వేల మంది ఉద్యోగులు ఉన్నారు.వీరికి జీతాల కింద రూ.100 కోట్లు వరకూ చెల్లిస్తుంటారు. సుమారు 13 వేల మంది పింఛనుదారులకు సుమారు రూ.40 కోట్ల వరకూ అందుతోంది.ఇక్కరిటైర్మెంట్ బెనిఫిట్స్, సరెండర్ లీవులు, డెత్ బెనిఫిట్స్, జీపీఎఫ్, ఎన్‌క్యాష్‌మెంట్ ఆఫర్ ఎర్న్ లీవులు వంటివన్నీ ఇక్కడ నుంచి రిలీజ్ అవుతుంటాయి. ఈ సారి ఏ సమస్య లేకుండా ముందుగానే క్లియర్ చేసినట్టు జిల్లా ట్రెజరీ అధికారి ఎన్.సత్యనారాయణ తెలిపారు. గత ప్రభుత్వంలో బిల్లులు పాసవ్వాలంటే చాలా ఇబ్బంది పడాల్సి వచ్చేది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నెమ్మదిగా అన్నీ దారిలో పడ్డాయి. గ్రీన్‌ఛానల్ ద్వారా అనేక బిల్లులకు ప్రభుత్వమే సీఎఫ్ఎంఎస్ ద్వారా క్లియర్ చేస్తోంది.అందరిలోనూ సంతృప్తిని పెంచుతోంది.



రిజిస్ట్రేషన్లకు..

స్లాట్ బుకింగ్

- జిల్లాలో 4 నుంచి అమలు
- గంటకు 12 స్లాట్లు
- టైమ్‌కి రాకపోతే రద్దు
- రాజమండ్రి ఆర్‌వోలో సేవలు
- సమయం వృథాకు స్వస్తి

రాజమహేంద్రవరం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : ప్రతి శాఖను సంస్కరించడం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోంది. దీనిలో రిజిస్ట్రేషన్ల శాఖలో ఓ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకొస్తోంది. ఆస్తుల రిజిస్ట్రేషన్ల తిప్పలను తప్పించడానికి ప్రభుత్వం నూతన ఆలోచన చేసింది. ఉదయం రిజిస్ట్రేషను ఆఫీస్‌కి వెళితే సాయంత్రం వరకూ వేచి ఉండే పరిస్థితికి స్వస్తి పలకనుంది. దీనిలో భాగంగా పాస్‌పోర్టుల మాదిరిగా స్లాట్ బుకింగ్ సదుపాయాన్ని ఈ నెల 4 నుంచి అందుబాటులోకి తీసుకురానుంది. రిజిస్ట్రేషను అవసరం ఉన్న వాళ్లు registration.ap.gov.in వెబ్‌సైటులోకి వెళితే అందుబాటులో ఉన్న స్లాట్లు కనిపిస్తాయి. క్రయవిక్రయదారుల్లో ఎవరో ఒకరు స్లాట్ బుక్ చేసిన వెంటనే వారికి ఓటీపీ మెసేజ్ ద్వారా వస్తుంది. దానిని రిజిస్ట్రేషను సమయంలో రిజిస్ట్రారుకు చెప్పాల్సి ఉంటుంది. ప్రస్తుతానికి జిల్లాకు ఒక రిజిస్ట్రారు కార్యాలయానికి ఈ సదుపాయం పరిమితం చేశారు. క్రమేణా వచ్చే సమస్యలను అధిగమించి అన్ని రిజిస్ట్రారు కార్యాలయాలకు దీనిని వర్తింపజేయనున్నారు. తూర్పు గోదావరి జిల్లాలో రాజమండ్రి రిజిస్ట్రారు కార్యాలయంలో ఈ సేవలు అందుబాటులో ఉండనున్నాయి. ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ గంటకు 12 చొప్పున స్లాట్లు ఉంటాయి. ఒకసారి స్లాట్ బుక్ చేసుకున్న తర్వాత ఆ సమయానికి రిజిస్ట్రారు కార్యాలయానికి వెళితే అరగంటలో రిజిస్ట్రేషను పూర్తవుతుందని జిల్లా రిజిస్ట్రారు రెడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. స్లాట్ సమయం నుంచి గంట లోపుగా స్లాట్ బుక్ చేసుకున్నవారు రాకపోతే రద్దవుతుందన్నారు. అందుబాటులో ఉన్న స్లాట్లకు అనుగుణంగా మళ్లీ స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు.దీని వల్ల తమ కార్యాలయాల్లో క్రయవిక్రయదారులు ఎక్కువ సేపు వేచి ఉండే అవసరం ఉండదన్నారు.ఈ సదుపాయాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



కొవ్వూరు వద్ద టోల్‌గేట్‌.. ధరల బోర్డు మారుస్తున్న సిబ్బంది



బాదుడు ఇలా..

టోల్..మోత!

వాహనదారులపై మళ్లీ టోల్ భారం

- సోమవారం రాత్రి నుంచి అమలు
- 10 నెలల్లో రెండు సార్లు
- రూ.5 నుంచి 50 వరకూ పెంపు
- పాస్‌ల రుసుము పెంపుదల
- ఫాస్టాగ్‌లో అదనంగా కట్
- వాహనదారుల ఆందోళన
- ఉమ్మడి జిల్లాలో 6 టోల్‌గేట్లు

టోల్‌చార్జీల బాదుడు మళ్లీ మొదలైంది. టోల్ ప్లాజాల వద్ద వసూలు చేసే రుసుములను పెం చుతూ నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇం డియా తీసుకున్న నిర్ణయం సోమవారం అర్ధ రాత్రి 12 గంటలు దాటిన తర్వాత నుంచి అమ ల్లోకి వచ్చింది. పదినెలల వ్యవధిలో రెండోసారి చార్జీలు పెంచడంతో వాహనదారులు షాక్‌కు గురయ్యారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తంగా ఆరు టోల్ ప్లాజాలు ఉన్నాయి.

(ఆంధ్రజ్యోతి-కొవ్వూరు/నల్లజర్ల)

ప్రభుత్వం వాహనదారులకు షాక్ వచ్చింది. కేవలం పది నెలల వ్యవధిలోనే రెండు సార్లు టోల్ రుసుములు పెంచడంతో ఆందోళనకు గురవుతున్నారు.సోమవారం అర్ధరాత్రి 12.01 గంటల నుంచి పెంచిన టోల్‌చార్జీలను వసూలు చేయడం ఆరంభించారు.గతేడాది జూన్‌లో పెంచి ఏడాది తిరక్కుండానే మళ్లీ చార్జీలు పెంచడంపై వాహనదారులు టోల్‌ప్లాజా సిబ్బందితో వాగ్వాదానికి దిగుతున్నారు.ఈ పరిస్థితి ఉమ్మడి జిల్లాలోని అన్ని టోల్‌ప్లాజాల వద్ద కనిపించింది. తమ ఫాస్టాగ్‌లో అధికంగా కట్ అయిందంటూ సోమవారం అర్ధరాత్రి తర్వాత పలువురు వాహనదారులు చాలా చోట్ల సిబ్బందిని నిలదీశారు.

పది నెలల్లో రెండో సారి..

అన్ని రకాల నాలుగు చక్రాల వాహనాలు ఆయా టోల్‌గేట్ల వద్ద నిర్ణీత రుసుమును ఫాస్టాగ్ ద్వారా చెల్లించాలి. ఫాస్టాగ్ లేకపోతే చార్జీలు 100 శాతం వరకూ అదనంగా వసూలు చేస్తారు.ఈ చార్జీలను నేషనల్ హైవే అథారిటీ నిర్ణయిస్తుంది. సాధారణంగా రహదారి నిర్మాణానికి అయ్యే వ్యయానికి అనుగుణంగా ఈ చార్జీలను నిర్ణయించి వసూలు చేస్తారు.ఇప్పుడు వీటిని ప్రతి ఏటా పెంచుతున్నారు. 2024-25లో జూన్ 3న టోల్ రుసుములు పెంచగా.. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచే పెంచుతూ నేషనల్ హైవే అథారిటీ నిర్ణయం తీసుకుంది. దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆరు టోల్‌ప్లాజాల్లో పెంపు నిర్ణయం అమల్లోకి వచ్చింది. రుసుముల పెంపులో ఎన్‌హెచ్ ఒక్కొక్క చోట ఒక్కో విధానాన్ని అవలంబించింది. 216వ జాతీయ రహదారిపై ఉన్న టోల్ ప్లాజాల్లో కార్లు, జీపులు, వేన్‌లు ఇతర తేలికపాటి వాహనాలకు ఒకవైపు రుసుమును పెంచలేదు. 24 గంటల వ్యవధిలో తిరిగి వస్తే వసూలు రుసుం మాత్రం పెంచారు.ఎన్‌హెచ్ 16పై మాత్రం అన్ని రకాల టోల్ రుసుములు పెంచి షాక్ ఇచ్చారు. టోల్‌గేట్ పరిధిలో ఉండే వాహనదారులకు ఇచ్చే నెలవారీ పాస్‌ల రుసుములను భారీగా పెంచారు. రూ.340గా ఉన్న రుసుమును రూ.350 చేశారు.

ఉమ్మడి జిల్లాలో టోల్‌గేట్లు ఇవీ..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో జాతీయ రహదారి 16పై తుని-రాజమహేంద్రవరం మధ్య కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం కృష్ణవరం,దివాన్‌చెరువు-సిద్ధాంతం మధ్య డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం ఈతకోట వద్ద టోల్‌ప్లాజాలు ఉన్నాయి. 216వ జాతీయ రహదారిపై కత్తిపూడి-కాకినాడ బైపాస్ మధ్య గొల్లప్రోలు, గురజానాపల్లి-పాశర్లపూడి మధ్య గల కోనసీమ జిల్లా అన్నంపల్లి వద్ద టోల్‌ప్లాజాలు ఉన్నాయి.ఇవన్నీ నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ఆధీనంలో ఉంటాయి.తూర్పుగోదావరి జిల్లాలో కొవ్వూరు గామన్ బ్రిడ్జిపైనల్లజర్ల మండలం వీరవల్లి వద్ద రెండు టోల్‌ప్లాజాలు ఉన్నాయి.ఇవి రాష్ట్ర ప్రభుత్వసంస్థ ఏపీఆర్‌డీసీ ఆధీనంలో ఉన్నాయి.

ఈతకోట (రావులపాలెం)

వాహనం	పాతది	కొత్తది
కారు,జీపు,వ్యాన్ -	రూ.120	125
రెండు వైపులా	రూ. 180	185
మినీబస్‌లు -	రూ.195	200
రెండు వైపులా	రూ. 290	300
బస్ లేదా ట్రక్	రూ. 405	420
రెండు వైపులా	రూ. 610	630
వ్యాపార వాహనాలు	రూ.445	460
రెండు వైపులా	రూ.665	690
భారీ వాహనాలు	రూ.445	460
రెండు వైపులా	రూ.665	690
మెషినరీ వాహనాలు	రూ.635	660
రెండు వైపులా	రూ.955	990
అతి భారీ వాహనాలు	రూ.775	805
రెండు వైపులా	రూ.1165	1205
నెలవారీ పాస్‌లు	రూ.340	350

కొవ్వూరు టోల్‌గేట్..(216ఏ)

వాహనం	పాతది	కొత్తది
కారు,జీపు,వ్యాన్ -	రూ.72	72
రెండు వైపులా	రూ. 108	110
మినీబస్‌లు -	రూ.108	110
రెండు వైపులా	రూ. 158	162
బస్ లేదా ట్రక్	రూ. 213	219
రెండు వైపులా	రూ. 320	328
వ్యాపార వాహనాలు	రూ.309	317
రెండు వైపులా	రూ.463	475

కృష్ణవరం (కిర్లంపూడి)

వాహనం	పాతది	కొత్తది
కారు,జీపు,వ్యాన్ -	రూ. 105	110
రెండు వైపులా	రూ. 160	165
మినీబస్‌లు -	రూ. 170	180
రెండు వైపులా	రూ. 260	265
బస్ లేదా ట్రక్	రూ. 360	375
రెండు వైపులా	రూ. 540	560
వ్యాపార వాహనాలు	రూ.395	410
రెండు వైపులా	రూ.590	610
మెషినరీ వాహనాలు	రూ.560	585
రెండు వైపులా	రూ.850	880
అతి భారీ వాహనాలు	రూ.690	715
రెండు వైపులా	రూ.1035	1070

అన్నంపల్లి (ముమ్మిడివరం)

వాహనం	పాతది	కొత్తది
కారు,జీపు,వ్యాన్ -	రూ. 60	60
రెండు వైపులా	రూ. 90	95
మినీబస్‌లు -	రూ. 95	100
రెండు వైపులా	రూ. 145	150
బస్ లేదా ట్రక్	రూ. 205	210
రెండు వైపులా	రూ. 305	315
వ్యాపార వాహనాలు	రూ.225	230
రెండు వైపులా	రూ.335	245
మెషినరీ వాహనాలు	రూ.320	330
రెండు వైపులా	రూ.480	495
అతి భారీ వాహనాలు	రూ.390	405
రెండు వైపులా	రూ.585	605

గొల్లప్రోలు టోల్‌గేట్

వాహనం	పాతది	కొత్తది
కారు,జీపు,వ్యాన్ -	రూ. 50	50
రెండు వైపులా	రూ. 75	80
మినీబస్‌లు -	రూ. 80	85
రెండు వైపులా	రూ. 120	125
బస్ లేదా ట్రక్	రూ. 170	175
రెండు వైపులా	రూ. 255	265
వ్యాపార వాహనాలు	రూ.185	195
రెండు వైపులా	రూ.280	290
మెషినరీ వాహనాలు	రూ.270	275
రెండు వైపులా	రూ.400	415
అతి భారీ వాహనాలు	రూ.325	340
రెండు వైపులా	రూ.490	505

వీరవల్లి (నల్లజర్ల)

వాహనం	పాతది	కొత్తది
కారు,జీపు,వ్యాన్ -	రూ. 160	165
రెండు వైపులా	రూ. 240	245
మినీబస్‌లు -	రూ. 255	265
రెండు వైపులా	రూ. 385	400
బస్ లేదా ట్రక్	రూ. 535	555
రెండు వైపులా	రూ. 805	835
వ్యాపార వాహనాలు	రూ.585	605
రెండు వైపులా	రూ.880	910
మెషినరీ వాహనాలు	రూ.840	870
రెండు వైపులా	రూ.1265	1310
అతి భారీ వాహనాలు	రూ.1025	1060
రెండు వైపులా	రూ.1540	1595

నేటి నుంచి రెండో ఉచిత సిలిండర్ బుకింగ్ ప్రారంభం

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని 2వ ఉచిత గ్యాస్ సిలిండర్ బుకింగ్ మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. ఈ మేరకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడంతో జిల్లా పౌరసరఫరాల అధికారులు అన్ని గ్యాస్ ఏజెన్సీలను అప్రమత్తం చేశారు. కూటమి ఎన్నికల హామీల్లో భాగంగా అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన గ్యాస్ వినియోగదారులకు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ హామీకి అనుగుణంగా తొలి ఉచిత గ్యాస్ సిలిండర్ బుకింగ్ గడువు మార్చి నెలాఖరుతో ముగిసింది. జిల్లాలో 4,68,010 మంది గ్యాస్ లబ్ధిదారులుండగా దాదాపు 40 వేల మంది వరకూ తొలి ఉచిత సిలిండర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోలేకపోయారు.

నల్లజర్లలో హత్య

ప్రేమ పెళ్లి చేసుకుని సరిగా చూడడంలేదని ఘాతుకం

3

రూ.84.61 కోట్లు వసూలు



రాజమహేంద్రవరంలో రాత్రి 12 గంటల వరకూ పన్నుల వసూళ్లు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పన్నులు చెల్లింపుదారులకు ఇచ్చిన వెసులుబాటును వినియోగదారులు సద్వినియోగం చేసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా మార్చి 31 ఆర్థిక సంవత్సరం ముగింపు పన్నులు చెల్లింపులు సోమవారం సమర్థవంతంగా జరిగాయి. జిల్లాలో రాజమహేంద్రవరం కార్పొరేషన్, కొవ్వూరు, నిడదవోలు మునిసిపాలిటీలతో పాటు ఇతర పంచాయతీల్లో సైతం పన్నులు చెల్లింపులు ప్రక్రియ వేగంగా సాగింది. సెలవు రోజులైన ఆదివారం, సోమవారం కూడా పన్నుల చెల్లింపుదార్ల కోసం అధికారులు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. ప్రజలు ఆయా కౌంటర్లను వినియోగించుకున్నారు. రాజమహేంద్రవరంలో 8 ప్రత్యేక కౌంటర్లను కమిషనర్ కేతన్ గార్గ్ ఏర్పాటు చేశారు. రాజమహేంద్రవరం కార్పొరేషన్ పరిధిలో పన్నులు చెల్లింపు దారులు ప్రభుత్వం కల్పించిన పన్నుల వడ్డీపై ప్రకటించిన 50 శాతం రాయితీ వినియోగించుకున్నారు. రాజమహేంద్రవరం నగరంలో సోమవారం ఒక్కరోజేఇంటిపన్నులు, ఖాళీ స్థలాల పన్నులు, వాటర్ చార్జిలు కలిసి మొత్తం రూ3 కోట్లు ప్రజలు కట్టారు.ఇప్పటి వరకు ఇంటి పన్నులకు సంబంధించి మొత్తం రూ.69 కోట్లు డిమాండ్‌కు మార్చి 31వ తేదీ అర్ధరాత్రి 12 గంటల వరకు రూ.65.19 కోట్లు వసూలు చేశారు.ఖాళీస్థలాల పన్నులు రూ.12.45 లక్షలు, వాటర్ చార్జీలు రూ.9.19 కోట్లు వసూలు చేశారు.చివరి రోజున హౌస్ ట్యాక్స్ రూ.2.19 కోట్లు, ఖాళీ స్థలాల పన్నులు రూ.44.87 లక్షలు ,వాటర్ చార్జిలు రూ.24 లక్షలు వసూలు చేశారు.రాజమహేంద్రవరంలో మొత్తం రూ.84.61 కోట్లు వసూలు చేసినట్టు కమిషనర్ తెలిపారు. ఇంకా 53.27 కోట్లు వసూలు కావాల్సి ఉంది.



మంత్రి దుర్గేష్ సమక్షంలో జనసేనలో చేరిన వైసీపీ కౌన్సిలర్లు, నాయకులు

నిడదవోలుతో మారుతున్న రాజకీయం

- జనసేనలోకి మరో ఇద్దరు
- కౌన్సిల్‌లో 11కి పెరిగిన బలం
- టచ్‌లో మరో ముగ్గురు?

నిడదవోలు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : నిడదవోలు పురపాలక సంఘంలో జనసేన పాగా వేసే సూచనలు కనిపిస్తున్నాయి. ఒక్కొక్కరుగా జనసేన పంచన చేరుతున్నారు. నిడదవోలులో వైసీపీకి చెందిన సీనియర్ నాయకురాలు, 6వ వార్డు కౌన్సిలర్ పువ్వల రతీదేవి,8వ వార్డు కౌన్సిలర్ గుర్రం శాంతిశ్రీ , జిల్లా వైసీపీ బీసీ సెల్ సెక్రటరీ గంగుల గోపియాదవ్, పట్టణ వైసీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గుర్రం జేమ్స్ సోమవారం జనసేన తీర్థం పుచ్చుకున్నారు.ఈ మేరకు రాష్ట్ర పర్యాటకసాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కందుల దుర్గేష్ జనసేన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గత ఎన్నికల్లో నిడదవోలు పురపాలక సంఘంలో 28వ వార్డులకు 27 వార్డుల్లో వైసీపీ కౌన్సిలర్లు విజయం సాధించగా.. ఒక టీడీపీ కౌన్సిలర్ ఉన్నారు. ఇటీవల జరిగిన రాజకీయ పరిణామాల్లో వైసీపీ నుంచి 9 మంది కౌన్సిలర్లు జనసేనలో జాయిన య్యారు. సోమవారం మరో ఇద్దరు చేరడంతో కౌన్సిల్‌లో జనసేన బలం 11కి పెరిగింది. దీనికి తోడు ఒక టీడీపీ కౌన్సిలర్ ఉన్నారు. త్వరలో మరో ముగ్గురు వైసీపీ కౌన్సిలర్లు జనసేనతో జత కట్టేందుకు సిద్ధంగా ఉన్నట్టు సమాచారం. త్వరలో జరగనున్న అవిశ్వాస తీర్మానంలో మునిసిపల్ కౌన్సిల్‌ను జనసేన ఖాతాలో వేసేందుకు జనసేన నాయకులు డాక్టర్ తోపరాల కళ్యాణ్ చక్రవర్తి, పెన్మెత్స చందులు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు.

లక్ష బంగారు కుటుంబాలు పీ-4 సర్వేలో గుర్తింపు

రాజమహేంద్రవరం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 5 లక్షల కుటుంబాలను సర్వే చేయగా అందులో సుమారు లక్ష పేద కుటుంబాలు ఉన్నట్టు అధికారులు గుర్తించారు. రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు పీ-4 సర్వే చేపట్టాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. 20 శాతంగా ఉన్న పేదలకు 10 శాతంగా ఉన్న సంపన్న వర్గాల ద్వారా సహాయం చేసి అభివృద్ధిలోకి తేవడానికి జీరో పావర్టీ-పీ4 మార్గదర్శి(బంగారు కుటుంబం) పేరుతో సర్వే చేపట్టిన సంగతి తెలిసిందే.లక్ష కుటుంబాలను అభివృద్ధి చేసే యోచనలో ప్రభుత్వం ఉంది. ప్రభుత్వం నుంచి గైడ్‌లైన్స్ రావాల్సి ఉంది. త్వరలో మార్గదర్శకాలు విడుదల చేయనుంది.

నేడు ఐచ్ఛిక సెలవు

రాజమహేంద్రవరం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి):రంజాన్ మరుసటి రోజైన మంగళవారం ఐచ్ఛిక సెలవు ప్రకటిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీ వక్ఫ్‌బోర్డు సీఈవో నివేదిక ఆధారంగా నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొంది. ఉద్యోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రసన్నకుమార్ ..అందరి మన్ననలు పొందారు


ప్రసన్నకుమార్‌ను సన్మానిస్తున్న ఉద్యోగులు

కొవ్వూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో మండల పరిషత్ సూపరింటెండెంట్ కోటగిరి ప్రసన్నకుమార్ అందరి మన్ననలు పొందారని ఎంపీపీ కాకర్ల నారాయుడు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆయన పదవీ విరమణ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరై ప్రసన్నకుమార్‌ను సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఈవోఆర్‌డీ బీ. ప్రకాశరావు, ఎంపీపీ కాకర్ల నారాయుడు, జడ్పీటీసీ బొంతా వెంకటలక్ష్మి, బండి పట్టాభిరామారావు, ముదునూరి నాగరాజు, సర్పంచ్‌లు ఉప్పులూరి రాజేంద్ర మునిప్రసాద్, పాలడుగుల లక్ష్మణరావు, మేకల శ్రీను, కాకర్ల బ్రహ్మాజీ, పీకే రంగారావు, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, పంచాయతీ సెక్రటరీలు, సచివాలయ కార్యదర్శులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీవి కుట్ర రాజకీయాలు

• జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ వెల్లడి


విలేకరులతో మాట్లాడుతున్న సత్యనారాయణ

నల్లజర్ల, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): వైసీపీ కుట్ర రాజకీయాలకు తెర లేపుతోందని జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి అచ్యుత సత్యనారాయణ అన్నారు. సోమవారం అచ్చన్నపాలెం కల్యాణ మండపంలో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు నియోజకవర్గంలోని జనసేన నాయకులు, కార్యకర్తలు సేకరించిన బియ్యం పంపించే విషయంలో పార్టీ నుంచి స్పష్టమైన ఆదేశాలు రాకపోవడంతో రెండు నెలలు తరువాత అవి పాడైపోయాయి. వాటిని పార్టీ అధిష్టానం మేరకు కుక్కునూరు, వేలురుపాడు మండలాలకు తరలించేందుకు సిద్ధం చేసిన విషయాన్ని జిల్లా నాయకులు కారటం సాయి, జిల్లా అధ్యక్షుడు కోటికలపుడి గోవింద రాజుకు విషయాన్ని తెలియజేశాము. బియ్యం తన ద్వారానే ఆవపాడు ఎంఎస్ బయోటెక్ కంపెనీకి కేజీ రూ.26లకు విక్రయించి ఆ డబ్బును పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దొడ్డిగర్ల సువర్ణరాజు పేరు మీద ఉన్న బ్యాంక్ అకౌంట్‌లో జమ చేయడం జరిగిందన్నారు. దీనిపై ఓ పత్రిక కథనాలు ప్రచురించిందన్నారు. నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి

• రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్


అభివృద్ధి చేసిన చెరువును పరిశీలిస్తున్న మంత్రి

ఉండ్రాజవరం, మార్చి 31 (ఆంధ్ర జ్యోతి): వేసవిలో తాగునీటి ఇబ్బం దులు లేకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. సూర్యారావుపాలెం ఊర చెర్వు తవ్వి అభివృద్ధి చేసిన అనంతరం నీరు ఫిల్టర్ చేసి ఇంటింటికీ అందించే కార్యక్రమాన్ని మంత్రి సోమవారం ప్రారంభించి మాట్లాడుతూ వేసవిలో గ్రామ ప్రజలకు నీటి ఎద్దడి లేకుండా పంచాయతీ తీసుకున్న నిర్ణయాన్ని అభినందిస్తున్నానన్నారు. గ్రామ సర్పంచ్ మెండే లలితకుమారి, ఉపసర్పంచ్ నందిన శ్రీనివాస్ చెరువు తవ్వకం పనుల గురించి మంత్రికి వివరించారు. దాతల సహకారంతో రూ.2.50 లక్షలతో చెరువు చుట్టు ఐదు రేవులను నిర్మించినట్లు వారు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వీఎస్ రామారావు, తహశీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భవాని, ఈవోపీఆర్డీ కె. ఆంజనేయశర్మ, మండల టీడీపీ అధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ, జనసేన మండల అధ్యక్షుడు వీరమళ్ల బాలాజీ, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికలో శాశ్వత భవన నిర్మాణం

నల్లజర్ల, మార్చి31 (ఆంధ్రజ్యోతి):వర్షాకాలం వచ్చిందంటే చాలు ... ఆ గ్రామంలో ఎవరు చనిపోయినా అంత్యక్రియలు జరిపేందుకు ఇతరగ్రామాలకు వెళ్లాల్సి వస్తోంది. దీంతో గ్రామానికి చెందిన గారపాటి వెంకటేశ్వరరావు స్పందించి తన సోదరుడు గారపాటి సత్యనారాయణ జ్ఞాపకార్థం శింగరాజుపాలెం శ్మశాన వాటికలో శాశ్వతభవనాన్ని నిర్మించినట్టు జనసేన పార్టీ మండల అధ్యక్షుడు దొండపాటి బాబు పేర్కొన్నారు. ఆదివారం దాన్ని సర్పంచ్ గద్దెతిలక్, గ్రామప్రజలకు అప్పగించారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్

• మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసిన ముస్లిం సోదరులు


తాళ్లపూడిలో నమాజ్ చేస్తున్న ముస్లింలు

కొవ్వూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రంజాన్ పండుగను పురస్కరించుకుని కొవ్వూరు పట్టణ, మండలంలో ముస్లిం సోదరులు సోమవారం ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. స్థానిక జామియా మసీదులో పండుగను ఘనంగా జరుపుకున్నారు. మసీదులను సుందరంగా విద్యుత్ కాంతులతో అలంకరించారు. మతపెద్దలు ప్రత్యేక సందేశాలను అందజేశారు. జామియా మసీదు, సత్యవతినగర్‌లోని మర్కజ్ మసీదు, ఔరంగాబాద్, మండలంలోని దొమ్మేరు, కాపవరం, గోవర్ధనగిరిమెట్ట మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మతపెద్దలు మాట్లాడుతూ రంజాన్ మాసం క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మికతల కలయిక అన్నారు. ఈ సూత్రాలను అనేక దశాబ్దాలుగా ముస్లిం సోదరులు పాటించడం జరుగుతుందన్నారు.

తాళ్లపూడి: పవిత్ర రంజాన్ సందర్భంగా తాళ్లపూడి అబూబకర్ మసీదు నందు అధ్యక్షుడు సర్దార్ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.గత నెలరోజులుగా ఉపవాస ప్రార్థనలు దిగ్విజయంగా పూర్తి చేసినట్టు తెలిపారు.రంజాన్‌రోజున ప్రక్కిలంక గోదావరి నదీ తీరం వద్ద గల ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మండలంలోని పలు గ్రామాల నుంచి ముస్లిం సోదరులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.


కాపవరం సాలర్ మసీదులో ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లిం సోదరులు

దేవరపల్లి: మండలంలోని అన్ని గ్రామాలలో రంజాన్ పండుగను సోమవారం ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. త్యాజంపూడి, యాదవోలు, గౌరీపట్నం, చిన్నాయిగూడెం, రంగరాయకాలనీ,దుద్దుకూరు, దేవరపల్లి, యర్నగూడెం గ్రామాల్లోని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు.


లక్ష్మీపురం మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లిం సోదరులు

రంజాన్ వేడుకల్లో మంత్రి దుర్గేష్

నిడదవోలు/ఉండ్రాజవరం, మార్చి 31 (ఆంధ్ర జ్యోతి): ముస్లిం సోదరులు రంజాన్ మాసంలో చేసిన ప్రార్థనలు, ఉపవాసాలు సర్వమానవ శాంతికి ఎంతో దోహదపడ తాయని రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. నిడదవోలు పట్టణం,మండలంలోని సమిశ్రగూడెం మసీదుల్లో సోమ వారం నిర్వహించిన రంజాన్ ప్రత్యేక ప్రార్థనల్లో మంత్రి పాల్గొని మాట్లాడారు. మంత్రి కందుల దుర్గేష్ ఉండ్రాజవరం మండలం పాలంగి మసీదులో జరిగిన రంజాన్ ప్రార్థనలో పాల్గొన్నారు. ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.మోర్త, ఉండ్రాజవరం, చిలకపాడు, చివటం, వేలివెన్ను తదితర గ్రామాల్లోని మసీదుల్లో రంజాన్ వేడుకలు జరిగాయి.

ఎమ్మెల్యే సొంత నిధులతో ప్రభుత్వ ఆసుపత్రిలో సౌకర్యాలు

నల్లజర్ల, మార్చి31 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు తమ సొంత నిధులతో గోపాలపురం నియోజకవర్గంలో ఉన్న నాలుగు మండలాల ప్రభుత్వ ఆసుపత్రిలో వేసవి దృష్ట్యా ఏసీలు, కూలర్లు, తాగునీటి సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుచ్చానని వైద్య ఉద్యోగుల సంఘం నాయకులు జీవీవీ ప్రసాద్ పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి ఆదివారం పత్రికా ప్రకటన విడుదల చేశారు.

సామూహిక భజనలు

రంగంపేట, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి శత జయంతి సందర్భంగా కోటపాడులో 100 గంటల సామూహిక భజనలు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ఇంటి ముంగిట రంగోలి ముగ్గులు పెట్టి, పచ్చని తోరణాలు అలంకరించారు. కుటుంబ సభ్యులంతా సామూహికంగా కూర్చొని బాబా చిత్రపటం వద్ద రెండుగంటల పాటు 50 ఇళ్లలో భజనలు చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

అందరినీ కలుపుకుని పనిచేస్తున్నా : ఎమ్మెల్యే

కొవ్వూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పార్టీలతో సంబంధం లేకుండా అందరినీ కలుపుకొని పనిచేస్తున్నానని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి టీవీ రామారావు ఆధ్వర్యంలో సోమవారం జనసేన నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీవీ రామారావు మాట్లాడుతూ జనసైనికులకు తగిన గుర్తింపు ఇవ్వాలన్నారు. టీవీ రామారావు, జిల్లా కార్యదర్శి మారిశెట్టి వెంకటేశ్వరరావు తీసుకున్న నిర్ణయాన్ని అమలు చేయాలని సూచించారు. ఎమ్మెల్యే ముప్పిడి మాట్లాడుతూ నా విజయానికి కృషిచేసిన ప్రతి జనసైనికునికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. కార్యక్రమంలో టీడీపీ ఫ్లోర్‌లీడర్ సూరపనేని చిన్ని, జనసేన నాయకులు మారిశెట్టి వెంకటేశ్వరరావు, డేగల రామ్ కుమార్, కె. నవ్య, కన్నాజీ రామాంజనేయులు, సిద్దా రామకృష్ణ, చెవ్వూరి రాము, బూరయ్య, తేజ, కాపవరం ఎంపీటీసీ ఎరుబండి సురేష్, చౌటిపల్లి శివ జనసైనికులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత


చెక్కును అందజేస్తున్న ఆంధ్రా సుగర్స్ జేఎండీ పెండ్యాల అచ్చిబాబు

కొవ్వూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : పేద ప్రజల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఆంధ్రా సుగర్స్ జేఎండీ పెండ్యాల అచ్యుతరామయ్య (అచ్చిబాబు) అన్నారు. దొమ్మేరులో అనారోగ్యానికి గురైన మట్టే శివరామారావుకి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ. 2,20,300 లక్షల చెక్కును అచ్చిబాబుకు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా నిరసన

చాగల్లు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఇస్లామ్ పేటలోని ఈద్గా, జామియా మసీదులో సోమవారం రంజాన్ పర్వదినం సందర్భంగా ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఈ సందర్భంగా ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపు మేరకు దేశవ్యాప్త నిరసనలో భాగంగా స్థానిక ఇస్లామ్ పేట ఈద్గా, జామియా మసీదులో చేతికి నల్ల రిబ్బన్లు కట్టుకుని నిరసన తెలిపారు. కార్యక్రమంలో మసీదు ముతవల్లిలు గౌస్ బేగ్, బాబూ బేగ్, అబ్దుల్ అయ్యూబ్, ఎస్‌కే యూసఫ్, షరీఫ్ అల్తాఫ్ జానీ, ఎండీ అల్తాఫ్, తదితరులు పాల్గొన్నారు.

శ్యాం రవిప్రకాష్‌కు ఉగాది పురస్కారం


పురస్కారాన్ని అందుకుంటున్న బొంతా శ్యాం రవిప్రకాష్

కొవ్వూరు, మార్చి31 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ఉగాది పురస్కారాన్ని మాల సంఘాల జేఏసీ కన్వీనర్ బొంతా శ్యాం రవిప్రకాష్ అందుకున్నారు. రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు దాసరి చెన్నకేశవులు, మాల ఉద్యోగ సంఘాల రాష్ట్ర అధ్య క్షుడు తుల్లీబిల్లీ అశోక్‌బాబు సంయుక్తంగా ఈ పురస్కారాన్ని అందించారు. గత 30 సంవత్సరాలుగా దళిత ఉద్యమాలలో అనేక పోరాటాలు చేయడంతో ఈ పురస్కారానికి ఎంపిక చేశారన్నారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

చెల్లెల్ని చంపుతానని బెదిరించిన అన్నపై కేసు

కొవ్వూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): తన వాటా ఇంట్లోకి వెళ్తున్న చెల్లెల్ని అడ్డుకుని చంపుతానని బెదిరించిన అన్నపై కేసు నమోదు చేసినట్టు పట్టణ ఏఎస్ఐ జీజీ ప్రకాష్ తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం... పట్టణంలోని క్రిస్టియన్‌పేటకు చెందిన జంగం రమాదేవి తల్లితండ్రులకు రెండు పోర్షన్ల భవనం ఉంది. ఆ ఇంటిలో అవివాహితుడైన సోదరుడు పోలుమాటి భీమారావుకు చెందిన ఒక వాటాను రమాదేవి పేరుమీద రిజిస్ట్రేషన్ చేయించారు. మార్చి 19వ తేదీన తన వాటా ఇంటిలోకి వెళ్తున్న రమాదేవిని అన్నయ్య పోలుమాటి రాంబాబు అడ్డగించి దాడిచేశాడు. ఇంట్లోకి వెళ్లాలని చూస్తే చంపుతానని బెదిరించడంతో పట్టణ పోలీసులకు ఆమె సోమవారం ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసినట్టు ఏఎస్ఐ తెలిపారు.

రెండోరోజూ కొనసాగిన ఉగాది ఉత్సవాలు


పుంతలో ముసలమ్మ వారి ఆలయం వద్ద గరగనృత్యాలు నిర్వహిస్తున్న దృశ్యం

కొవ్వూరు, మార్చి 31 (ఆంధ్ర జ్యోతి) : కొవ్వూరు పట్టణ, మండలంలోని కనకదుర్గమ్మ ఆలయాల వద్ద ఉగాది ఉత్సవాలు రెండో రోజైన సోమవారమూ కొనసాగాయి. స్థానిక జూనియర్ కాలేజ్ వద్ద, గోదావరి ఏటిగట్టుపై భక్తాంజనేయ స్నానఘట్టం వద్ద వేంచేసియున్న గ్రామదేవత కొవ్వూరమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. మొయిన్‌రోడ్‌లోని పుంతలో ముసలమ్మ వారి ఆలయం వద్ద గరగనృత్యాలతో సందడి చేశారు. ఫ్యాక్టరీ రోడ్డులోని నూకాలమ్మ ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

తాళ్లపూడి సిరిబొమ్మ ఉత్సవంలో అపశ్రుతి

• రాళ్లు, అరటిపళ్లతో కొట్టే విషయంలో గొడవ • ఇరువర్గాలపై కేసులు నమోదు


గ్రామదేవత ఆలయం వద్ద సిరిబొమ్మ సమీపంలో జరుగుతున్న వివాదం

తాళ్లపూడి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ఉగాది పర్వదినం సంద ర్భంగా తాళ్లపూడి గ్రామదేవత మోదుగులమ్మ ప్రతిరూపమైన సిరిబొమ్మ ఉత్సవంలో అపశృతి చోటుచేసు కుంది. ఈ సందర్భంగా ఇరువర్గాలపై కేసులు నమోదయ్యాయి. ఎన్నో ఏళ్ల చరిత్ర కలిగిన ఈ ఉత్సవంలో గతంలో ఎప్పుడూ లేని విధంగా ఒకరిపై ఒకరు దాడులకు పాల్ప డ్డారు. ఉగాది పర్వదినాన సిరిబొమ్మకు గ్రామోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఈ ఉత్సవం అనంతరం సిరిబొమ్మను బహిరంగ ప్రదేశంలో ఓ కొయ్యకు కట్టి తిప్పుతారు. ఆ సమయంలో అరటిపళ్లు, జీడిమామిడి కాయలతో సిరబొమ్మపై విసరడం ఆచారంగా వస్తుంది. కార్యక్రమం ప్రారంభం కాకమునుపే కొంతమంది రాళ్లతో, అరటిపళ్లతో కొట్టారు. దీంతో నెలకొన్న వివాదం వడ్డీలు, అగ్రికుల క్షత్రియు లైన రెండుకులాల మధ్య వివాదంగా మారింది. అక్కడ పరిస్థితిని పోలీసులు సర్దుపాటు చేసినా రాత్రి అంతా యుద్ధవా తావరణం నెలకొంది. వడ్డీల కులానికి చెందిన ఓ ఇంటిపై అగ్నికుల క్షత్రియులు దాడిచేసే సమయంలో పోలీసులు వచ్చి ప్రమాదం జరగకుండా నిలువరించారు. ఇరు కులాల వారు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు. ఈ మేరకు ఎస్ఐ టీ. రామకృష్ణ ఇరువర్గాలపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

తెలుగువారి విశిష్ట పండుగ ఉగాది

• రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్


మార్కొండపాడులో ఉగాది పురస్కారాలు అందుకున్న వారితో మంత్రి

చాగల్లు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): తెలుగు ప్రజల విశిష్ట పండుగ ఉగాది అని రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. సుంకవల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుం కవల్లి వెంకటరత్నం మెమోరియల్ ట్రస్టు తరఫున వారి కుమారుడు వెంకన్న చౌదరి, శేషకుమారి దంపతులు గత 17 సంవత్స రాలుగా ఉగాది పురస్కారాల ప్రదానోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మార్కొం డపాడు శ్రీనిలయంలో సోమవారం జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి, ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా సుంకవల్లి వెంకన్న చౌదరి కుటుంబాన్ని ఎమ్మెల్యే అభినందించారు. శశి విద్యా సంస్థల ఛైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ, మాజీ ఉప కులపతి పులపా సుబ్బారావు, డీఈవో కే. వాసుదేవరావు, ఉత్తమ రైతులు, ఉత్తమ విద్యార్థులు, అధికారులను సన్మానించి మెమెంటోలు బహూకరించారు. మాజీ ఏఎంసీ ఛైర్మన్ ఆళ్ల హరిబాబు, మండల టీడీపీ అధ్యక్షుడు నాదెళ్ల శ్రీరామ్ చౌదరి, సూరపనేని చిన్ని, సుంకవల్లి రమేష్, ఉప్పులూరి చిరంజీవి పాల్గొన్నారు.

కారు నుంచి మంటలు..


నల్లజర్ల వద్ద దగ్ధమవుతున్న కారు

నల్లజర్ల, మార్చి31 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నుంచి రాజమహేంద్రవరం వెళుతున్న కారు అనంతపల్లి టోల్‌ప్లాజా వద్ద ఆదివారం సా యంత్రం కాలిపోయింది. వివరాలిలా ఉన్నాయి. సీఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ రత్నం తన భర్త మహేశ్‌తో కర్నూలు నుంచి రాజమ హేంద్రవరం వెళుతున్నారు. అనంతపల్లి టోల్ ప్లాజా వద్దకు కారు రాగా ఇంజన్‌లో సమస్య ఏర్పాడి కాలిపోతున్న వాసన రావడంతో హుటా హుటిన కారు రోడ్డు పక్కకు నిలిపి ఇద్దరు దిగిపోయారు. దీంతో ఒక్కసారిగా ఇంజన్ నుం చి మంటలు ఏర్పడి అందరు చూస్తుండగానే క్షణల్లో కారు మొత్తం దగ్ధమైపోయింది.

సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసిన వ్యక్తిపై కేసు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 31(ఆంధ్ర జ్యోతి): పాస్టర్ ప్రవీణ్ పగడాల మరణంపై సోషల్ మీడియాలో వివిధ రకాలుగా దుష్ప్రచారం చేస్తున్న రాజమహేంద్రవరం లలితానగర్‌కు చెందిన దేవాబత్తుల నాగమహేష్‌పై కేసు నమోదు చేసినట్టు త్రీటౌన్ సీఐ అప్పారావు తెలిపారు.ప్రవీణ్ మృతిపై తప్పుడు ప్రచారం చేస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన నాగ మహేష్‌పై క్రైమ్ నెంబరు 141/20 25గా యు/ఎస్ 196(1), 351 ఎన్‌బీఎస్ అండ్ సెక్షన్ 76 ఆఫ్ఐటి యాక్ట్ 2000-08 కిం ద కేసు నమోదు చేసినట్టు తెలిపారు. నిందితుడ్ని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచామన్నారు.

మద్యం మత్తు బలిగొంది

• కారు ఢీకొని ఇద్దరి మృతి • రెండు కుటుంబాల్లో విషాదం

రాజానగరం, మార్చి31 (ఆంధ్రజ్యోతి): ఉగాది పర్వదినం ఆ రెండు కుటుంబాల్లో చేదును మిగిల్చింది. వీరిలో ఒకరు ఉగాది పండగ జరుపుకునేందుకు స్వగ్రామానికి రాగా, మరొకరు బతుకుదెరువు కోసం ర్యాపిడో బైక్ నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి కొంతమూరు వద్ద కారు రూపంలో వచ్చిన మృత్యువు ఇద్దరి కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. రాజానగరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొంతమూరులో సోమవారం తెల్లవారు జామున జరిగిన ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొంతమూరులోని కళ్యాణ్ నగర్‌కు చెందిన ఒంటెద్దు వెంకటేష్ (29) బెంగళూరులోని సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. ఉగాది సందర్భంగా స్వగ్రామం వచ్చాడు. రాజమహేంద్రవరంలోని స్నేహితులను కలిసేందుకు వెళ్లాడు. తిరిగి ఇంటికి వచ్చేందుకు మోరంపూడికి చెందిన ర్యాపిడో బైకిస్టు ఈర్లు నాగబాబు (43)ను ఆశ్రయించాడు. ర్యాపిడో బైక్‌పై ఇద్దరు కొంతమూరుకు వస్తుండగా మార్గమధ్యంలో మనీషా ఫంక్షన్ హాల్ సమీపంలో రాత్రి రెండు గంటల సమయంలో వెనుక వైపు నుంచి వేగంగా వస్తున్న కారు వీరు ప్రయాణిస్తున్న మోటార్‌సైకిల్‌ను బలంగా ఢీకొన్నది. ప్రమాదానికి కారణమైన కారులో ఉన్న యువకులు మద్యం మత్తులో ఉన్నట్లుగా తెలిసింది. దీంతో మద్యం మత్తు ఆరెండు కుటుంబాలను తీవ్ర విషాదంలోకి నెట్టింది. ఈ ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి వెంకటేష్‌ను కారు దాదాపు కిలోమీటర్ మేర ఈడ్చుకుంటూ వెళ్లింది. వెంకటేష్ తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మరణించారు. కాగా ర్యాపిడో బైక్ నిర్వాహకుడు ఈర్లు నాగబాబుకు కూడా ఈప్రమాదంలో బలమైన గాయాలయ్యాయి. సంఘటనా స్థలంలో కొనఊపిరితో కొట్టుమిట్టాడుతున్న తరుణంలో చికిత్స కోసం రాజమహేంద్రవరం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారని రాజానగరం పోలీసులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన కారు ఆగకుండా వెళ్లిందని, మృతుల కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. ఈ మేరకు రాజానగరం ఎస్.ఐ మనోహర్ కేసు నమోదు చేశారు.